ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -348 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం 16 నవంబర్ 2025

# ఏఐ విప్లవానికి నాయకత్వం వహిద్దాం

**ఉద్యోగాల కోతపై భయాలు అవసరం లేదు**

**'క్వాంటమ్'లో భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుంది**

**2029 కల్లా ఇన్నోవేషన్ ఆధారిత రాష్ట్రంగా మారుస్తాం: లోకేశ్**




**విశాఖపట్నం,నవంబర్ 15ఆంధ్ర ప్రగతి** : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విప్లవం మనల్ని నడిపించకూడదని, మనమే ఏఐ విప్లవానికి నాయకత్వం వహిద్దామని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా రెండోరోజైన శనివారం 'ఏఐ, ఉద్యోగాలు భవిష్యత్తు- అంతరాలను, అవకాశాలను మార్చడం' అనే అంశంపై నిర్వహించిన సెషన్‌లో మంత్రి కీలకోపన్యాసం చేశారు. ఏఐ విప్లవంలో భాగస్వాములయ్యేందుకు మూడు విధాలుగా సన్నద్ధమవుదామని పిలుపునిచ్చారు. రీ-స్కిల్లింగ్, రీ-డిఫైనింగ్, రీ-ఇమేజనింగ్ అని మూడు 'ఆర్' ఫార్ములాను ఆయన ప్రతిపాదించారు. రీ-స్కిల్లింగ్‌లో భాగంగా ఏఐ సాంకేతికతలో ప్రస్తుతం అన్నిరంగాల్లో ఉన్న నిపుణుల నైపుణ్యాలను మెరుగుపరచాలని అన్నారుమిగతా 2లో...

# 3 రోజుల్లో రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు

**ఎంవోయూలను 100 శాతం సాకారం చేస్తాం.. మూడేళ్లలోనే సాధిస్తాం**

**మా మంత్రులు, అధికారులు వెంటబడతారు.. దావోస్‌కు హైబ్రిడ్ మోడల్‌గా విశాఖ సదస్సు**

**భారీ పెట్టుబడులతోపాటు చర్చలకూ చోటు.. రికార్డుస్థాయిలో 4,975 మంది హాజరు**

**గత ప్రభుత్వం ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసింది.. విద్యుత్తు పీపీఏలను రద్దు చేసింది**

**అలాంటివి పునరావృతం కానివ్వం..**

**ముగింపు సభలో బాబు**






**విశాఖపట్నం, నవంబర్ 15ఆంధ్ర ప్రగతి** సీఐఐ భాగస్వాముల సదస్సు సూపర్ హిట్ అయిందని, సీఐఐ చరిత్రలో ఇంత బాగా సదస్సు జరగడం ఇదే తొలిసారి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖలో రెండు రోజులు జరిగిన సదస్సులో 613 ఎంవోయూలు చేసుకున్నామని, వాటి ద్వారా రూ. 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు. ఎంవోయూలన్నీ నిబద్ధతగల పెట్టుబడిదారులతో చేసుకున్నవేనని, వీటన్నింటినీ మూడేళ్లలో వందశాతం సాకారం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రెండు రోజుల సదస్సు ముగింపు సందర్భంగా శనివారం సీఎం మీడియాతో మాట్లాడారు. ఎంవోయూలు చేసుకున్న పరిశ్రమలకు వీలైనంత తొందరలోనే అన్ని అనుమతులు లభించేలా చేసి, పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చూస్తామని తెలిపారు. ఒకసారి కమిట్ అయిన తర్వాత తమ మంత్రులు, అధికారులే వెంటబడిమరీ వారిని తీసుకొస్తారని సరదాగా అన్నారు. సదస్సుకు ముందు ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకునేందుకు భారీ కసరత్తు చేసిందని, కేంద్రం కూడా పూర్తిస్థాయిలో సహకరించిందన్నారు. మిగతా 2లో...

## విశాఖలో విజయవంతంగా ముగిసిన సీఐఐ భాగస్వామ్య సదస్సు

# తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌పై హ్యాకర్ల దాడి

**సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

**హైదరాబాద్ నవంబర్ 15ఆంధ్ర ప్రగతి** తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురవడం తీవ్ర కలకలం రేపింది. కొందరు వినియోగదారులు ఆర్డర్ కాపీలు, కేసుల వివరాల కోసం సైట్‌ను యాక్సెస్ చేయగా, అది అకస్మాత్తుగా ఆగిపోయింది. ఆ వెంటనే హైకోర్టు వెబ్‌సైట్ స్థానంలో ఓ బెట్టింగ్ సైట్ ప్రత్యక్షమవడంతో సిబ్బంది, న్యాయవాదులు షాక్‌కు గురయ్యారు. మిగతా 2లో...




# ముఠాల మూలాలు తేల్చండి..

**విశాఖ గోమాంసం ఘటనపై పవన్ కల్యాణ్ సీరియస్**

**నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరిక**

**పోలీస్ కమిషనర్‌తో స్వయంగా మాట్లాడి వివరాలు సేకరణ**

**కోల్డ్ స్టోరేజీలో 1.89 లక్షల కిలోల గో మాంసం స్వాధీనం**




**అమరావతినవంబర్ 15ఆంధ్ర ప్రగతి** విశాఖ నగరంలో భారీ ఎత్తున అక్రమ గోమాంసం నిల్వలు బయటపడిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ దందా వెనుక ఉన్న ముఠాల మూలాలనుమిగతా 2లో...

# 'ఐ-బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు

**14 రోజుల రిమాండ్..**

**చంచల్‌గూడ జైలుకు తరలింపు**




**ఫ్రాన్స్ నుంచి వచ్చిన ఇమ్మడి రవి**

**కూకట్‌పల్లిలోని అతని ఫ్లాట్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**

# అదిహత్యే..!

**టీటీడీ మాజీ అధికారి సతీష్ మృతి కేసులో కీలక మలుపు.. హత్యగా నిర్ధారణ!**

**సీఐడీ విచారణకు వెళ్తుండగా రైలులో ఘటన**

**తాడిపత్రి సమీపంలో రైలు పట్టాలపై మృతదేహం లభ్యం**

**గుత్తి జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదు**

**పరకామణి చోరీ కేసులో సతీష్ ప్రధాన ఫిర్యాదుదారు**



# ఇక స్థానిక ఎన్నికలే

## రాహుల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**జూబ్లీహిల్స్ బైపోల్‌లో విజయంపై అగ్రనేత అభినందనలు**

**సీఎం వెంట మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్, నవీన్ యాదవ్**

**రాహుల్‌గాంధీకి కొత్త ఎమ్మెల్యేను పరిచయం చేసిన రేవంత్‌రెడ్డి**

**ముఖ్యమంత్రి టీమ్‌కు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ శుభాకాంక్షలు**

**న్యూఢిల్లీనవంబర్ 15ఆంధ్ర ప్రగతి** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయంపై సీఎం రేవంత్ రెడ్డిని పార్టీ అగ్రనాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మెచ్చుకున్నారు. మంత్రివర్గం నుంచి పార్టీ కార్యకర్త వరకు ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని గెలుపు తీరాలకు చేర్చడంపై సీఎం టీమ్‌కు రాహుల్‌తో పాటు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ మిగతా 2లో...



# ఏపీ మద్యం స్కామ్.. ముంబైలో కీలక అరెస్ట్

**ముంబైకి చెందిన మనీలాండరింగ్ నిపుణుడు అనిల్ చోఖ్రా అరెస్ట్**

**ప్రధాన నిందితుడికి చెందిన రూ.77.55 కోట్లు మళ్లించినట్లు ఆరోపణ**

**డొల్ల కంపెనీలతో నిధులు బదిలీ చేసినట్లు గుర్తించిన సిట్**

**కేసులో 49వ నిందితుడిగా చేర్చిన అధికారులు**

**విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు**



**న్యూఢిల్లీ నవంబర్ 15ఆంధ్ర ప్రగతి** జగన్ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన భారీ మద్యం కుంభకోణం కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ కేసులో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముంబైకి చెందిన అనిల్ చోఖ్రాను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అరెస్టు చేశారు.మిగతా 2లో...

# 3 రోజుల్లో రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

భారీ పరిశ్రమలకు మౌలిక సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. పరిశ్రమలు వచ్చేకొద్దీ ఆర్థిక కార్యకలాపాలు పుంజుకొంటాయని, ప్రభుత్వానికి జీఎస్టీ, ఇతర రూపాల్లో ఆదాయం వస్తుందని వివరించారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంపొందించడంలో విశాఖ సదస్సు విజయవంతమైందని, ఏకంగా 4,975 మంది ప్రతినిధులు పాల్గొనడం ఒక రికార్డు అని తెలిపారు. మొత్తం 41 సెషన్స్ నడిచాయని, తాను స్వయంగా 24 ద్వైపాక్షిక చర్చల్లో భాగస్వామినయ్యానని చెప్పారు. భవిష్యత్తు తరం పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే ఉద్దేశంతో 500 మంది విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశామని,వారిని దృష్టిలో ఉంచుకునే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

"ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెసకు మారాం. పరిశ్రమలకు ఏం అవసరమో వాటిపై దృష్టి సారించాం. గ్రీన్ ఎనర్జీ లేకుంటే గూగుల్ రాదు. ఇదంతా ఓ లింకు. అందుకే గ్రీన్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి సారించాం. సూపర్ సిక్స్ అమలు చేసుకుంటూ వచ్చాం.. సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా చేస్తానని చెప్పా. అలాగే చేసి చూపిస్తున్నాను. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పా. ఇప్పటికే 24 లక్షల ఉద్యోగాలకు గ్యారంటీ ఇచ్చే పరిస్థితికి వచ్చాం. ఐదేళ్లలో 500 బిలియన్ యూఎస్ డాలర్ల పెట్టుబడులు రావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. దానివల్ల 50 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. పదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు.. కోటి మందికి ఉద్యోగాలు రావాలన్నది లక్ష్యం. ఐటీ వల్ల కొన్ని ఉద్యోగాలు పోయినా ప్రత్యామ్నాయంగా ఇతర రంగాల్లో ఉపాధి కల్పనపై దృష్టి పెడుతున్నాం."

"రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణపై దృష్టి పెట్టాం. ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అదే సమయంలో ఈస్ట్ నుంచి వెస్ట్‌కు కూడా అభివృద్ధి చేస్తున్నాం. ఉత్తరాంధ్రలో మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతోంది. దీనికి చరిత్రలో లేనంత త్వరగా అనుమతులు తీసుకొచ్చాం. నేరుగా ప్రధానితో మాట్లాడి అవసరమైన అనుమతులు తీసుకొచ్చాం. లులూ మాల్ విశాఖలో 2028కి పూర్తవుతుంది. ప్రతి పరిశ్రమ ఎన్ని ఉద్యోగాలు ఇస్తుందనే అంశంపై స్పష్టత తీసుకుంటున్నాం. అలాగే పరిశ్రమలను ఎంఎస్ఎంఈలతో ఎలా అనుసంధానం చేయాలన్న ఆలోచన కూడా చేస్తున్నాం. గతంలో కుటుంబానికో ఐటీ నిపుణుడు అన్నాం. ఇప్పుడు ప్రతి కుటుంబానికో ఎంటర్‌ప్రెన్యూర్.. అనేది లక్ష్యం."

**102 పార్కులు ఖరారు.. త్వరలో మరో 77**

"175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉన్నాం. ఇప్పటికే 102 పార్కులను ఖరారు చేశాం. ఇంకో 72 జనవరికి ఖరారవుతాయి. స్పెషల్ ఎకనామిక్ జోన్లు.. మెగా పార్కులు.. ప్రైవేటు పార్కులను అనుసంధానం చేస్తున్నాం. ఎస్ఈజెడ్, మెడ్‌టెక్ పార్కు కలిగిన విశాఖలో ప్లగ్ ప్లే సౌకర్యం కల్పించాం. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. శ్రీసిటీలో 240 యూనిట్లు ఉన్నాయి. దానికోసం ఇంకో 4వేల ఎకరాలు ఇస్తున్నాం. లక్షాయాభైవేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఇప్పటికే 31 దేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టారు. రానున్న రోజుల్లో 50 దేశాల నుంచి ఇక్కడ పరిశ్రమలు పెట్టాలన్నది లక్ష్యం. ఇదొక వినూత్నమైన పారిశ్రామిక అభివృద్ధి మోడల్."

**జగన్ 'ఎంవోయూ'లనూ ఫాలోఅప్ చేస్తున్నాం : సీఎం**

జగన్ 2023లో విశాఖలో పెట్టిన భాగస్వామ్య సదస్సులో 13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని చెప్పారని, అవి ఎన్ని వచ్చాయని విలేకరులు అడిగి ప్రశ్నకు.. అప్పట్లో పెట్టుబడులు పెట్టేవారిని తరిమేశారని, అప్పట్లో ఎంవోయూలు చేసుకున్నవారిలో ఎవరైనా ముందుకొస్తే ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. అప్పట్లో పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని తిట్టేసి వెళ్లిపోయారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రైవేటు ఇండస్ట్రీస్ పార్కుల ఏర్పాటుకు ఎవరైనా ముందుకొస్తే వారిని ప్రోత్సహిస్తున్నామని, ల్యాండ్ ఫూలింగ్‌కు ముందుకొచ్చినా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వపరంగా చాలా ఆదుకున్నామ న్నారు. ప్రైవేటు స్టీల్ ఫ్యాక్టరీలు లాభాల్లో ఉంటే పబ్లిక్ సెక్టార్ రంగంలో నష్టాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. సమర్థ నిర్వహణ ఉండాలని, స్టీల్‌ప్లాంట్ ఎట్టి పరిస్థితుల్లో నష్టాల్లో నడవడానికి వీల్లేదని, ఆ బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే రూ.8 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు రాష్ట్రంలోకి వచ్చాయని వివరించారు. భాగస్వామ్య సదస్సు రెండో రోజు శనివారం విదేశీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వచ్చే ఏడాది నవంబరులో మళ్లీ విశాఖలోనే సదస్సు నిర్వహిస్తామని, కుటుంబాలతో వచ్చి అరకు వెళ్లి కాఫీని ఆస్వాదించాలని కోరారు.

# ఇక స్థానిక ఎన్నికలే

(మొదటి పేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఢిల్లీలో ని 10 జన్‌పథ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేతత్వంలోని టీమ్.. రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసింది.

సీఎంతో పాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఖైరతాబాద్ డీసీసీ చీఫ్ రోహిన్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలిచిన నవీన్ యాదవ్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి నవీన్ యాదవ్‌ను సీఎం పరిచయం చేశారు. బీఆర్ఎస్ ఇలాకాలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడంలో పార్టీ శ్రేణుల చేసిన కృషిని వివరించారు. పార్టీ విజయం కోసం ప్రచారం మొదలు, బూత్ లెవల్ వరకు కార్యకర్తలే ముందుండి పోరాడారన్నారు. ఘనవిజయానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ రాహుల్ అభినందించారు. అలాగే ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**ఖర్గేతో భేటీ**

తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో రేవంత్‌రెడ్డి బృందం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విజయం సాధించిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌ను ఖర్గే అభినందించారు. ఖర్గేతో కూడా సీఎం బృందం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించినట్టుగా సమాచారం. అంతకుముందు కె.సి వేణుగోపాల్‌తో కాసేపు సీఎం, రాష్ట్ర ముఖ్యనేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా పరిస్థితులను సీఎం ఆయనకు వివరించారు. జూబ్లీహిల్స్ భారీ గెలుపుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు, ఈ విషయంలో హైకోర్టు ఆదేశాలు, డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ, మంత్రి వర్గం వంటి పలు అంశాలపై చర్చించినట్టు తెలిసింది. అనంతరం సీనియర్ నేత, రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్‌కు సంబంధించిన ఒక ప్రయివేటు ప్రొగ్రాంలో సీఎం పాల్గొన్నారు. ఈ రోజు(ఆదివారం) ఉదయం 10 గంటలకు ఢిల్లీ పర్యటన ముగించుకొని సీఎం తిరిగి హైదరాబాద్ బయలు దేరనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**యావత్ తెలంగాణ కాంగ్రెస్‌తో ఉందనే సందేశం ఇచ్చారు: పీసీసీ చీఫ్**

జూబ్లీహిల్స్‌లో భారీ మెజార్టీతో విజయం సాధించటం ద్వారా యావత్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీతో ఉందనే సందేశాన్ని ఓటర్లు ఇచ్చారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. రెండేండ్ల ప్రజాపాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజలు తీర్పునిచ్చారన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుంటామని చెప్పారు. ఎంఐఎం మద్దతు, డబ్బులతో కాంగ్రెస్ గెలిచిందన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బీజేపీకి డిపాజిట్ కూడా రాలేదనీ, ఆ పార్టీ నేతగా కిషన్‌రెడ్డి ఏం మాట్లాడినా ప్రజలు ఆదరించరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై క్యాబినెట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అలాగే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి కమిట్‌మెంట్ ఉందని మరోసారి గుర్తు చేశారు. బలహీన వర్గాలకు ఈ రిజర్వేషన్లు అందకుండ బీజేపీ అడ్డంకులు సృష్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా తనను మంత్రివర్గంలోకి తీసుకుంటారంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదన్నారు. ఆ జాబితాలో తన పేరు లేదని చెప్పారు.

**బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి అవాస్తవం : ఎమ్మెల్యే నవీన్ యాదవ్**

ప్రజా సేవ చేసేందుకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపేందుకు ఢిల్లీ వచ్చినట్టు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపొందిన నవీన్ యాదవ్ చెప్పారు. "నియోజక వర్గ ప్రజలు భారీ మెజార్టీతో నన్ను ఆశీర్వదించారు. వారందరికీ రుణపడి ఉంటా. కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు చెప్పడానికి ఢిల్లీ వచ్చాను. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్‌లతో కలిసి కాంగ్రెస్ అగ్రనేతల నుంచి ఆశీర్వాదం తీసుకున్నా.." అని ఆయన తెలిపారు. అయితే బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేసినట్టు కేటీఆర్ చేస్తోన్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు.

# అది హత్యే..!

**టీటీడీ మాజీ అధికారి సతీష్ మృతి కేసులో కీలక మలుపు.. హత్యగా నిర్ధారణ!**

**అమరావతినవంబర్ 15ఆంధ్ర ప్రగతి**



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ సహాయ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి (ఏవీఎస్‌వో) వై. సతీష్ కుమార్ మృతి కేసు కీలక మలుపు తిరిగింది. ఆయన మరణాన్ని అనుమానాస్పద మృతిగా కాకుండా హత్యగా నిర్ధరించిన రైల్వే పోలీసులు, కేసు నమోదు చేశారు. తిరుమల పరకామణిలో డాలర్ల చోరీ కేసులోని నిందితులే ఈ హత్యకు పాల్పడినట్లు మృతుని బంధువులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనంతపురం జిల్లా గుత్తి జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ప్రస్తుతం గుంతకల్లు రైల్వే సీఐగా పనిచేస్తున్న సతీష్ కుమార్, గతంలో టీటీడీ ఏవీఎస్‌వోగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో పరకామణిలో జరిగిన డాలర్ల చోరీ కేసులో ఈయనే ప్రధాన ఫిర్యాదుదారుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి తిరుపతిలో సీఐడీ విచారణకు హాజరయ్యేందుకు గురువారం అర్ధరాత్రి ఆయన గుంతకల్లు నుంచి రైలులో బయలుదేరారు.

అయితే, శుక్రవారం ఉదయం తాడిపత్రి మండలం కోమలి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల పక్కన ఆయన విగతజీవిగా కనిపించారు. ఇదే కేసులో ఇప్పటికే ఈ నెల 6న ఒకసారి సీఐడీ విచారణకు హాజరైన ఆయన, రెండోసారి విచారణకు వెళ్తుండగా ఈ దారుణం చోటుచేసుకోవడం పలు అనుమానాలకు దారి తీసింది. బంధువుల ఫిర్యాదుతో పోలీసులు హత్య కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

# బాలకృష్ణ అనుచరులు హిందూపురం వైసీపీ ఆఫీసును ధ్వంసం చేశారు: జగన్

**అమరావతినవంబర్ 15ఆంధ్ర ప్రగతి**



హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై జరిగిన దాడిని ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం తమ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి కాదని, ప్రజాస్వామ్యంపైనే జరిగిన ఒక క్రూరమైన దాడి అని ఆయన అభివర్ణించారు. టీడీపీ నేతలు, బాలకృష్ణ అనుచరులు సాగించిన ఈ దౌర్జన్యం అత్యంత హేయమైన, ఆటవిక చర్య అని మండిపడ్డారు. రాజకీయ పార్టీలే కార్యాలయాలను ధ్వంసం చేయడం, ఫర్నిచర్‌ను పగలగొట్టడం, కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడటం వంటివి ప్రజాస్వామ్య విలువలు ప్రమాదకర స్థాయిలో పతనమయ్యాయనడానికి నిదర్శనమని జగన్ ట్వీట్ చేశారు. ఈ దాడి సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత ఆందోళనకరమని జగన్ విమర్శించారు. వారి నిశ్శబ్దం కేవలం నిర్లక్ష్యం కాదని, అది ఒక హెచ్చరిక అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాల కోసం, రాజకీయ అజెండా కోసం బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారనడానికి ఈ ఘటనే నిలువెత్తు సాక్ష్యమని ఆరోపించారు. పోలీసుల ప్రేక్షకపాత్ర వెనుక ప్రభుత్వ పెద్దల అండదండలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు.

హిందూపురంలో టీడీపీ ప్రదర్శించిన ఈ క్రూరత్వం, చంద్రబాబు నాయకత్వం ఏ విధంగా గుంపులను రెచ్చగొడుతుందో, హింసను ఎలా ప్రోత్సహిస్తుందో స్పష్టం చేస్తోందని జగన్ పేర్కొన్నారు. భయం, దౌర్జన్యాలతో రాజకీయ ప్రత్యర్థులను అణచివేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఒక ప్రభుత్వం తన ప్రత్యర్థుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కూడా కాపాడలేనప్పుడు, ఇక పాలన గురించి మాట్లాడే నైతిక హక్కును పూర్తిగా కోల్పోయినట్టేనని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది కేవలం వైసీపీ కార్యాలయంపై జరిగిన దాడి కాదని, ప్రజాస్వామ్యాన్ని, రాజకీయ స్వేచ్ఛను విశ్వసించే ప్రతి పౌరుడిపై జరిగిన దాడిగా భావిస్తున్నామని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# ఏఐ విప్లవానికి నాయకత్వం వహిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

అందులో భాగంగా ఏపీ ప్రభుత్వం నైపుణ్యం అనే ప్లాట్‌ఫాంను తయారుచేసిందని చెప్పారు. రీ-డిఫైనింగ్‌లో భాగంగా ఏఐ, మానవ మేధస్సు సహకారంతో ఉత్పత్తి రంగంలో మార్పులు తీసుకురావాలన్నారు. రీ-ఇమేజింగ్‌లో అసమానతలను సంప్రదాయ కోణంలో కాకుండా ఏఐ కోణంలో చూడాలని తెలిపారు. మనుషుల్లో అసమానతలకు ఏఐ కారణం కాకూడదని, వాటిని తొలగించే వారధి కావాలని ఆకాంక్షించారు. ఏఐ కారణంగా రానున్న రోజుల్లో ఉద్యోగాల కోత వంటి భయాలు అవసరం లేదని, దీనివల్ల ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు, భయాలకు వచ్చే ఐదేళ్లలో ఏపీ ఒక సమాధానంగా నిలుస్తుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో 'ఏఐ ఈజ్ రెడీ ఫర్ ఏజెంటిక్ ఏఐ' అనే నివేదికను ఆవిష్కరించారు. అనంతరం రానున్న ఐదేళ్లలో 30వేల మంది యువతకు నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్, సీఐఐ భాగస్వామ్యంతో విజయవాడలో మోడల్ కెరీర్ సెంటర్ ఏర్పాటుపై ఏంవోయూ చేసుకున్నారు.

**'క్వాంటం పాలసీ- 2025' విడుదల**

క్వాంటం రంగంలో ప్రపంచంలోనే భారత్ టాప్‌లో నిలుస్తుందని, ఈ రంగంలో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్రం సంసిద్ధంగా ఉందని లోకేశ్ అన్నారు. 'ఆత్మనిర్భర్ క్వాంటం- ఆంధ్రప్రదేశ్‌లో స్వదేశీ క్వాంటం స్టాక్ నిర్మాణం' అనే అంశంపై నిర్వహించిన చర్చలో మంత్రి మాట్లాడారు. క్వాంటం కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టాలెంట్, నమ్మకం అనే నాలుగు పిల్లర్లపై అమరావతి క్వాంటం వ్యాలీ ఆధారపడి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా క్వాంటం పాలసీ- 2025ను ఆవిష్కరించారు. ఏటా 15 వేల మంది విద్యార్థులకు క్వాంటం కంప్యూటింగ్‌లో శిక్షణ ఇస్తామని సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీ, క్వాంటం పాలసీ గురించి ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్ వివరించారు. అనంతరం లోకేశ్ సమక్షంలో 25 సంస్థలతో ప్రభుత్వం క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించి ఒప్పందాలు చేసుకుంది.

# 'ఐ-బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు

## 14 రోజుల రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు



న్యూఢిల్లీ **నవంబర్ 15ఆంధ్ర ప్రగతి**

దేశవ్యాప్తంగా విడుదలైన సినిమాలను, ఓటీటీ కంటెంట్లను గంటల్లోనే పైరసీ చేసి విడుదల చేస్తున్న 'ఐ-బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవికి హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు రెండు వారాల రిమాండ్ విధించింది. కూకట్‌పల్లిలోని ఒక ఫ్లాట్‌లో ఉండగా సైబర్ క్రైమ్ పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఇమ్మడి రవిని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఇమ్మడి రవి నిన్ననే ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చాడు. కూకట్‌పల్లిలోని రెయిన్ విస్టా ఫ్లాట్‌లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను కరేబియన్ దీవుల్లో ఉంటూ ఐ-బొమ్మ నిర్వహిస్తున్నాడు. అతడి స్వస్థలం విశాఖపట్నం. అతడి ఫ్లాట్ నుంచి పెద్ద మొత్తంలో హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, సినిమాలకు సంబంధించిన హెచ్‌డీ ప్రింట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్‌లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న కొన్ని సినిమాల కంటెంట్‌ను హెూల్డ్ చేశారు.

# ముఠాల మూలాలు తేల్చండి..

(మొదటి పేజీ తరువాయి)

తక్షణమే వెలికితీయాలని విశాఖ పోలీసులను ఆయన ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఘటన వెలుగులోకి రాగానే ఆయన నేరుగా విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీఆర్ఐ అధికారులు మిత్రా కోల్డ్ స్టోరేజీలో జరిపిన దాడుల్లో 1.89 లక్షల కిలోల గోమాంసాన్ని స్వాధీనం చేసుకుని, కేసును పోలీసులకు అప్పగించినట్లు కమిషనర్ పవన్ కల్యాణ్‌కు వివరించారు. కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. ఈ మాంసాన్ని ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలించాలని చూశారు, అనుమతుల్లో ఎలాంటి ఉల్లంఘనలు జరిగాయనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని కమిషనర్ పేర్కొన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

అక్రమ గోవధ, గోమాంసం విక్రయాలు, ఎగుమతులను ఏ రూపంలోనూ సహించేది లేదని పవన్ తేల్చిచెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం గోవధ నిషేధంపై ఎంత పటిష్టంగా పనిచేస్తుందో ఈ ఘటనే నిదర్శనమని అన్నారు. గతంలో తన దృష్టికి రాగానే పిఠాపురంలోని జంతు వధశాలను మూసివేయించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఠ

# తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌పై హ్యాకర్ల దాడి

విషయాన్ని గుర్తించిన వెంటనే హైకోర్టు రిజిస్ట్రార్ సిబ్బంది హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ హ్యాకింగ్ వెనుక ఎవరున్నారు? హ్యాకర్లు సర్వర్‌లోకి ఎలా యాక్సెస్ సంపాదించారు? సర్వర్ భద్రతలో ఏమైనా లోపాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఈ ఘటన కారణంగా హైకోర్టు వెబ్‌సైట్ సేవలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేసుకోవడంలో, కేసుల వివరాలు తెలుసుకోవడంలో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం టెక్నికల్ బృందాలు వెబ్‌సైట్ భద్రతను బలోపేతం చేసే పనుల్లో నిమగ్నమయ్యాయి. న్యాయవ్యవస్థకు సంబంధించిన కీలక వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# ఏపీ మద్యం స్కామ్..ముంబైలో కీలక అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డికి చెందిన రూ.77.55 కోట్ల నగదును డొల్ల కంపెనీల ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆయనపై ప్రధాన అభియోగం.సిట్ దర్యాప్తు ప్రకారం చోఖ్రా ముంబై కేంద్రంగా బినామీల పేర్లతో నాలుగు డొల్ల కంపెనీలను సృష్టించాడు. క్రిపటి ఎంటర్‌ప్రైజెస్, నైస్‌నా మల్టీ వెంచర్స్, ఓల్విక్ మల్టీ వెంచర్స్, విశాల్ ఎంటర్‌ప్రైజెస్ పేర్లతో ఉన్న ఈ కంపెనీల ఖాతాల్లోకి తొలుత లిక్కర్ సొమ్మును జమచేశారు. అనంతరం ఆ నిధులను మరో 32 వేర్వేరు ఖాతాలకు బదిలీ (లేయరింగ్) చేసి, నల్లధనాన్ని తెల్లధనంగా మార్చే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు.అనిల్ చోఖ్రాకు మనీలాండరింగ్ కొత్తేమీ కాదని, గతంలో ఇదే తరహా నేరాలకు పాల్పడినందుకు 2017, 2021 సంవత్సరాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయన్ను రెండుసార్లు అరెస్టు చేసిందని సిట్ తెలిపింది. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత, లిక్కర్ స్కామ్ సొమ్మును వైట్‌గా మార్చేందుకు మద్యం స్కామ్ నిందితులు ఆయన్ను సంప్రదించినట్లు దర్యాప్తులో తేలింది. భారీగా కమీషన్ తీసుకుని చోఖ్రా ఈ లావాదేవీలకు సహకరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 16 నవంబర్ 2025

# శాంతిరామ్‌లో మెదడుకు 'పిన్-హెూల్' సర్జరీ..!


## కోత, కుట్టు లేకుండానే ప్రాణాపాయం నుంచి రక్షణ.

**అత్యంత సంక్లిష్టమైన 'బ్రెయిన్ అన్యూరిజం' రక్తస్రావానికి ఆధునిక చికిత్స.**

**శాంతిరం డాక్టర్ల నవీన్ కుమార్, శివరాం రెడ్డి పర్యవేక్షణలో అద్భుత విజయం.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 15:**
శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో మెదడుకు అత్యధికమైన శాస్త్ర చికిత్స ద్వారా పిన్ హెూల్ సర్జరీ చేసి 63 సంవత్సరాల వ్యక్తికి నిండు ప్రాణాన్ని కాపాడిన శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు,
శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో వైద్యులు, అత్యంత సంక్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సను 'పిన్-హెూల్' పద్ధతిలో, అంటే కోత. కుట్టు, మచ్చ లేకుండా నిర్వహించి, ఒక 63 ఏళ్ల వ్యక్తికి ప్రాణదానం చేశారు,
వివరాల్లోకి వెళితే, 63 సంవత్సరాల వయసున్న ఒక వ్యక్తి, 'బ్రెయిన్ అన్యూరిజం' (మెదడులోని రక్తనాళం ఉబ్బి పగలడం) కారణంగా తీవ్రమైన రక్తస్రావంతో, ప్రాణాపాయ స్థితిలో శాంతిరామ్ హాస్పిటల్ ఎమర్జెన్సీకి వచ్చారు. ఇలాంటి కేసులలో ప్రతి నిమిషం అమూల్యమైనది. వెంటనే శాంతిరాం హాస్పిటల్ డాక్టర్లు స్పందించిన హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్ గోడా, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ శివరామరెడ్డి, నేతృత్వంలోని బృందం, పరిస్థితిని సమీక్షించింది.
సాధారణంగా ఇలాంటి సందర్భాలలో, ఓపెన్ బ్రెయిన్ సర్జరీ (పుర్రెను తెరిచి) చేస్తారు. ఇది అత్యంత క్లిష్టమైనది మరియు రోగి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కానీ, శాంతిరామ్ వైద్య బృందం అత్యాధునిక 'ఎండోవాస్క్యులర్ కాయిల్ ఎంబోలైజేషన్' పద్ధతిని ఎంచుకుంది. ఈ విధానంలో, ఎటువంటి కోత లేకుండా, కేవలం తొడ భాగం నుంచి రక్తనాళం ద్వారా ఒక ప్రత్యేకమైన గొట్టాన్ని (కెథెటర్) పంపి, మెదడులోని పగిలిన రక్తనాళం వద్దక చేరుస్తారు. అక్కడ 'ప్లాటినం కాయిల్స్' వేసి, రక్తస్రావాన్ని తక్షణమే అదుపులోకి తెచ్చారు. రోగి కొద్ది రోజుల్లోనే పూర్తిగా కోలుకున్నారు.
ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యం అందించడమే మా లక్ష్యం యాజమాన్యం ఈ అద్భుత విజయంపై శాంతిరామ్ హాస్పిటల్ డైరెక్టర్ %డ% ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మిద్దె రఘురామ్, జనరల్ మేనేజర్ ఫ్రాన్సిస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మిస్టర్ శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు.
హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలలో మాత్రమే లభించే అత్యంత సంక్లిష్టమైన న్యూరో చికిత్సలను, ఇప్పుడు 24/7 శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అందుబాటులోకి తేవడం మా ఆశయం. దానికి ఈ విజయవంతమైన సర్జరీయే నిదర్శనం. అత్యుత్తమ వైద్యులు, ఆధునిక సాంకేతిక పరికరాలు మా బలం" అని వారు తెలిపారు.
24/7 న్యూరో ఎమర్జెన్సీ సేవలు: డాక్టర్ నవీన్ కుమార్ గోడా డాక్టర్ నవీన్ కుమార్ గోడా మాట్లాడుతూ.. "ఇటువంటి సంక్లిష్టమైన న్యూరో-వాస్క్యులర్ ఎమర్జెన్సీలకు, నిపుణులైన ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్, న్యూరో సర్జన్, న్యూరో ఫిజీషియన్ల సమన్వయం చాలా అవసరం. మా హాస్పిటల్‌లో ఈ బృందం 24/7 అందుబాటులో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. బ్రెయిన్ స్ట్రోక్, అన్యూరిజం వంటి సమస్యలకు, సమయం కోల్పోకుండా మా హాస్పిటల్‌కు వస్తే, అధునాతన చికిత్స ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు" అని భరోసా ఇచ్చారు.


### ప్రజలకోసం: 'బ్రెయిన్ అన్యూరిజం' లక్షణాలను విస్మరించవద్దు!

మెదడులోని రక్తనాళం ఉబ్బి, అకస్మాత్తుగా పగలడాన్నే 'అన్యూరిజం రక్తస్రావం' అంటారు. ఇది అత్యంత ప్రమాదకరమైనది.
ప్రమాద సంకేతాలు:తీవ్రమైన తలనొప్పి జీవితంలో ఎన్నడూ లేనంత భరించలేని, ఆకస్మిక తలనొప్పి ('థండర్‌క్లాప్ హెడేక్' అని కూడా అంటారు)
వాంతులు, వికారం,
మెడ బిగుసుకుపోవడం,
కళ్లు మసకబారడం లేదా డబుల్ విజన్,
అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం. పై లక్షణాలు దేనిలోనైనా కనిపిస్తే అది బ్రెయిన్ స్ట్రోక్ లేదా అన్యూరిజం కావచ్చు, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే ఇంటర్నేషనల్ న్యూరాలజీ , న్యూరో సర్జరీ మరియు 24/7 క్యాథ ల్యాబ్ సదుపాయాలు ఉన్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (శాంతిరాం వంటివి ) లకు తరలించడం అత్యవసరం అని తెలిపారు.

# కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 15:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర%-%స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని పారిశుధ్య చర్యలకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డీఆర్ఓ రాము నాయక్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే స్వర్ణాంధ్ర%-%స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొన్నారు. పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా, సామాజిక కర్తవ్యంగా భావించి ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ముందుండాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకర జీవనానికి, సమాజ అభ్యున్నతికి, అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని ఆమె గుర్తుచేశారు. డీఆర్ఓ రాము నాయక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సిబ్బంది కార్యాలయ ప్రాంగణంలో చెత్త తొలగింపు, మొక్కల సంరక్షణ, పరిసర పరిశుభ్రత వంటి శుభ్రత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ తో పాటు జెసి, అధికారులు, సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.



# కోటపాడులో తీవ్ర విషాదం.!

**కొడుకు మరణించిన 20 రోజులకే గుండెపోటుతో తండ్రి మృతి.**







**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల నవంబర్ 15:**
సిరివెళ్ల మండలం పరిధిలోని కోటపాడు గ్రామంలో తండ్రీకొడుకుల మరణంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన మల్లెల సుబ్బరాయుడు (వయసు 37 సంవత్సరాలు) 20 రోజుల కిందట మరణించగా, ఆ దుఃఖం నుంచి కోలుకోకముందే కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఆయన తండ్రి మల్లెల పెద్ద సుబ్బా రాయుడు (60) గుండెపోటుతో మరణించారు. మల్లెల పెద్ద సుబ్బా రాయుడు కొడుకు (మృతుడు సుబ్బా రాయుడు) మరియు ఒక కూతురు సంతానం కాగా, మరణించిన కొడుకు సుబ్బా రాయుడుకు భార్యతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన ఆ ముగ్గురు ఆడపిల్లల దుస్థితిని చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కోటపాడు గ్రామ మాజీ సర్పంచ్ శకుంతలమ్మ మరియు కోటపాడు బూత్ ఇంచార్జ్ సుబ్బారావు సంతాపం తెలియజేసి మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో భక్తి వెలుగులు.

**వాయులింగేశ్వరుని దర్శించుకున్న కూరగాయల దాత మార్కెట్ ప్రసాద్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 15:**
మూగ జీవులకు (సాలిపురుగు, పాము, ఏనుగు) మోక్షం ప్రసాదించిన పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో భక్తి సేవలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పంచభూతాలలో వాయువు తత్త్వాన్ని ప్రతిబింబించే వాయులింగ క్షేత్రం కావడంతో దేశవ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు.
పార్వతి దేవి జ్ఞాన ప్రసూనాంబికగా కరుణ విరజిమ్ముతున్న ఈ దివ్య స్థలంలో దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు ఆలయ అధికారులు వీలైన సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా కూరగాయల దాతగా ప్రసిద్ధి చెందిన మార్కెట్ ప్రసాద్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపుతూ సేవా కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. భక్తసేవలో భాగంగా ఎల్లప్పుడూ ముందుండే మార్కెట్ ప్రసాద్ ని ఆలయ అధికారులు ప్రత్యేకంగా సత్కరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి టి. బాపిరెడ్డి గారు స్వయంగా ఇచ్చిన గౌరవపూర్వక ఆహ్వానాన్ని మార్కెట్ ప్రసాద్ గారు స్వీకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
భక్తుల కోరికలు తీర్చబడే క్షేత్రంగా పేరుగాంచిన శ్రీకాళహస్తిలో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

# రోడ్డుభద్రత నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సి ఐ మల్లికార్జున గుప్తా.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ నవంబర్ 15:**
కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మార్గదర్శకత్వంలో మరియు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు శనివారం నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ మరియు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా విద్యార్థి దశ నుండే రహదారి ప్రమాదాలపై, ట్రాఫిక్ మరియు రోడ్డుభద్రత నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్న సంకల్పంతో నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో పట్టణ కేంద్రం నందు గల న్యూక్లియస్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.

**పోలీసు వారి ముఖ్య సూచనలు .**

**మైనర్లకు వాహనాలు వద్దు:**
18 ఏళ్ల లోపు పిల్లలు వాహనాలు నడపరాదు. నిబంధన ఉల్లంఘిస్తే తల్లిదండ్రులు/సంరక్షకులపై చట్టపరమైన చర్యలు తప్పవు.
**హెల్మెట్ %డ% సీట్ బెల్ట్ తప్పనిసరి:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ పెట్టుకోవడం అనివార్యం. ఇది ప్రాణాలను కాపాడే భద్రతా కవచం.

**వేగం %డ% లోడ్ నియంత్రణ:** వేగం కన్నా ప్రాణం మిన్న అనే సూత్రాన్ని ఎప్పుడూ మరువరాదు. మరియు వాహనాల పరిమితికి మించి వస్తువులను ప్రయాణికులను రవాణా చేయరాదు .

**??డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదు:**
మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరం. అటువంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.
**సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదు**
వాహనాలు నడుపు సందర్భంలో సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదని తద్వారా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
ట్రిబుల్ రైడింగ్ చేయరాదు
మోటర్ సైకిల్ పై ప్రయాణించేటప్పుడు ట్రిబుల్ రైడింగ్ చేయడం వలన వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా విద్యార్థులే కాక నంద్యాల జిల్లా ప్రజలందరూ ట్రాఫిక్, రోడ్డుభద్రత నిబంధనలు కచ్చితంగా పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు.
జీవితం మీది %-% రక్షణ మీ చేతుల్లోనే! అనే విషయాన్ని ఎల్లప్పుడూ మరవరాదని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## భక్తులతో కిక్కిరిసిన శ్రీ సర్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయం.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల నవంబర్ 15:**
నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారిలో అభయారణ్యంలో వెలసిన శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామికి కార్తీక శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. ఉదయాన్నే స్వామివారికి పూలాభిషేకం, తీర్థాభిషేకం, కుంకుమార్చన అభిషేకాలు ఆలయ అర్చకులు పవన్ కుమార్ శర్మ, రంగనాయకులు పూజా కార్యక్రమం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఏకాదశి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.


# వరికి మద్దతు ధర ఇవ్వాలి

## అరటి రైతులను ఆదుకోవాలి.



**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 15:** మహానంది మండలం లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల సమితి సమావేశం నిర్వహించడం జరిగింది.సమావేశానికి అధ్యక్షులుగా సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామెల్ సమావేశమునకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న రైతు సంఘంజిల్లా సహాయ కార్యదర్శి కే భాస్కర్ రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు ఏ సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు పై నాయకులు మాట్లాడుతూ.. మహానంది మండలంలో ఇప్పుడిప్పుడే వరి పంటకోతలు జరుగుతూ  జరుగుతున్నాయి. వర్రి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అలాగే మహానంది మండలంలో ఎక్కువ అరటిపంట వేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అరటిపండుకు కూడా ప్రభుత్వమే సరైన రేటు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశ అనంతరం నూతన మండల  కమిటీని 11 మందిని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులుగా కే మనోహర్ కార్యదర్శిగా పి రాజు సహాయ కార్యదర్శిగా వెంకటరామిరెడ్డి రాముడు చెన్నయ్య విష్ణ పాణ్యం శేఖర్ శ్రీనివాసులు ఎం రాజేశ్వరయ్య ఎన్నుకోవడం  జరిగింది.

## రబీ సీజన్ కు వరి నారుమల్లను సిద్ధం చేస్తున్న రైతులు.



**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 15:** రబీ సీజన్ కు సంబంధించి వరి నారుమళ్ళను రైతులు సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో వేసిన వరి పంట సకాలంలో చేతికి రాక తుపాన్లు గాలుల వల్ల నేల వాలిన సంగతి విధితమే. ఇంతవరకు ప్రభుత్వం నుండి తుపానులు, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సహాయ సహకారాలు అందలేదని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్ లో పండించిన  వరి కి కనీస గిట్టుబాటు ధర కూడా అందడం లేదని దిగుబడి కూడా తగ్గిపోయిందని అంటున్నారు. ఇవన్నీ మర్చిపోయిన రైతన్న రబీ సీజన్లో అయినా వరి పండిస్తే మంచి దిగుబడి, ధర రాకపోదా అనే ఆశతో సాగుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు రైతులను రబి సీజన్లో వేసే పంటలకు సకాలంలో ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తుందా లేక ఖరీఫ్ సీజన్లో యూరియా కోసం పడిన పాట్లు పడాల్సి వస్తుందా అనే మీమాంసలో రైతులు ఉన్నట్లు తెలుస్తుంది. మరి ప్రభుత్వం, ఉన్నత స్థాయి అధికారులు యూరియా పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అనేది తెలియాల్సి ఉంది. రబీ సీజన్ ప్రారంభంలోనే సరైన చర్యలు తీసుకుంటే యూరియా కొరత ఏర్పడదని లేకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు తెలియజేస్తున్నారు.

## స్వామి నాయక్ కూతురు వివాహానికి హాజరైన ఎన్ఎండి ఫయాజ్.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు నవంబర్ 15:**కర్నూల్ బళ్లారి చౌరస్తా దగ్గర ఉన్న కేశవ గ్రాండ్ కల్యాణ మండపం నందు జరిగిన నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మరియు టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి డుమావత్ స్వామి నాయక్ కూతురు యశోద బాయి వివాహానికి హాజరై నూతన వధూవరులైన్ యశోద బాయి , సురేంద్ర నాయక్ లను ఆశీర్వదించిన టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్. ఈ వివాహ వేడుకలలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , షబ్బీర్, అక్బర్ ,కాంట్రాక్టర్ రవి, ఈశ్వర్, కార్పొరేషన్ డైరెక్టర్లు మునియార్ ఖలీల్, ఉప్పరి సురేష్ కుమార్, క్లస్టర్ కామిని మల్లికార్జున, చిన్నంశెట్టి శ్రీనివాసులు, అస్మద్దీన్, అజ్మీర్, శ్రీకాంత్ , జైలాన్ , బుగ్గ రాముడు, షేక్ మొహమ్మద్ రఫీ (మున్నా), రంగ ప్రసాద్,లాయర్ బాబు, ప్రసాద్ రెడ్డి, పుసులూరు పుల్లయ్య, గిరి, చాంద్ రెబల్, ఇమ్రాన్, హలీమ్ తదితరులు  పాల్గొన్నారు

# సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

**తాగునీరు, మరుగుదొడ్లు, ఆహార నాణ్యతపై నిరంతర శ్రద్ధ అవసరం.**

**వంద రోజుల యాక్షన్ ప్లాన్‌తో పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు 15:**
జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంక్షేమ వసతి గృహాల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల వసతి గృహాల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై జిల్లా కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బిసి సంక్షేమ శాఖ అధికారి జగ్గయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, సర్వశిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమనాథ్ కుమార్, గురుకులం కోఆర్డినేటర్ శ్రీదేవి, 38 వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పిల్లలను తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో వదిలి వెళ్తారని, అలాంటి విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, శుభ్రత, విద్యా ప్రమాణాల విషయంలో ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గత ఏడాది జిల్లాలో పదవ తరగతి పరీక్షలు రాసిన 25 వేల మంది విద్యార్థుల్లో 82 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారని, మిగతా 18 శాతం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డిసెంబర్ 5 నాటికి పదవ తరగతి సిలబస్ పూర్తవుతుందని... 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా, వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం, అపరిశుభ్ర పరిస్థితులు, మౌలిక సదుపాయాల లోపాలను తీవ్రంగా పరిగణిస్తామని, కండక్ట్ రూల్స్ ప్రకారం సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం రుచికరమైన, ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆమె స్పష్టం చేశారు. స్పెషల్ అధికారుల నివేదికలను పరిశీలిస్తూ, ప్రతి హాస్టల్ సామర్థ్యం, గదుల లభ్యత, భవనం స్థితి, ఆర్ఓ ప్లాంటు, దోమతెరలు, మంచాలు, సిక్ రూమ్, ఆడుకునే స్థలం, ప్రహరీ గోడ, మరుగుదొడ్ల పరిస్థితి, సిబ్బంది లభ్యత వంటి అంశాలపై వివరాలు సేకరించారు. అన్ని హాస్టల్లో తగిన మౌలిక వసతులు ఏర్పాటు చేసే వరకు స్వయంగా పర్యవేక్షిస్తానని తాగునీరు, శుభ్రమైన టాయిలెట్లు, నాణ్యమైన ఆహారం, విద్యుత్ సదుపాయం, భద్రతా చర్యలు... వీటన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. అన్ని వసతి గృహాల్లో ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ఈ సమయంలో స్పెషల్ ఆఫీసర్లు తనిఖీలు జరపాలని ఆమె ఆదేశించారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి, అవసరమైనన్ని డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వసతి గృహాల నిర్వహణ మెరుగైతే అక్కడి సామర్థ్యం పెరిగి మరింత మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ అన్నారు. సమావేశంలో మండలాల వారీగా స్పెషల్ అధికారులు, సంక్షేమ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మరియు పోలీసుల మధ్య కోఆర్డినేషన్ మీటింగ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 15:**
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల పట్టణంలోని రామక్రిష్ణ పీజీ కళాశాల మీటింగ్ హాల్ నందు కర్నూలు ,నంద్యాల జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మరియు పోలీసు అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సి .సరళాదేవి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ మీటింగ్ యొక్క ముఖ్య ఉద్దేశం క్రిమినల్ కేసులలో పోలీస్ మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ల మధ్య కోఆర్డినేషన్ ఎలా ఉండాలి అనే అంశంపై చర్చ జరిగింది. ఒక వ్యక్తి నేరం చేసినప్పుడు సదరు వ్యక్తిని అరెస్టు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు కోర్టులో హాజరుపరచుటకు ముందు పోలీస్ అధికారులు నిర్వహించవలసిన విధివిధానాల గురించి కోర్టు వారు వివరించడం జరిగింది.



దర్యాప్తు అధికారి నేరం చేసిన వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకోవడంలో ముఖ్యపాత్ర పోషించాలని కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పించాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సి .సరళాదేవి తోపాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి ఎం.జావళి, డోన్ డిఎస్పి శ్రీనివాస్,సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు మరియు మహేశ్వరి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోతీలాల్



, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు సి వి.శ్రీనివాసులు, వై. శ్రీహరి, థర్డ్ క్లాస్ ఏ డి జె అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద్యాల నాగ రాజశేఖర్ రెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివప్రసాదరావు,కర్నూలు, నంద్యాల జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మరియు నంద్యాల జిల్లా పోలీసు అదికారులు పాల్గొన్నారు.

# నిజమైన శ్రేయస్సు మోక్షమే.!

**కీర్తిరాజదాస్ స్వామి -గోపూజతో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.**

**ఆంధ్ర ప్రగతి పగిడాల నవంబర్ 15:**
నిజమైన శ్రేయస్సు అంటే మోక్షమేనని, మోహాన్ని నశింపచేసుకోవడమే మోక్షమని, వస్తుప్రీతి సుఖాన్ని అందించకపోగా దుఃఖ కారకమవుతుందని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తిరాజదాస్ స్వామి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, పగిద్యాల మండలం, ప్రాతకోటలో వెలసిన శ్రీ మోక్షేశ్వర స్వామి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వారు శ్రీమద్రామాయణము, మహాభారతం, భగవద్గీత, శ్రీ వేంకటేశ్వర స్వామి అవతార



విశేషాల గురించి భక్తులకు వివరించారు. ముగింపు సందర్భంగా భక్తులందరితో సామూహిక కుంకుమార్చన మరియు గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ



కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ పి. శేషమ్మ, విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ పూజారి మోక్షేశ్వరుడు, నందికొట్కూరు స్కాలర్స్ పాఠశాల కరెస్పాండెంట్ కాళ్ళూరి లక్ష్మీ, ఆలయకమిటీ సభ్యులు, భజన బృందం సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# భగవద్గీత మానవునికి ప్రబోధించిన కర్తవ్యబోధ.

**టి. జి. వెంకటేశ్, మాజీ మంత్రివర్యులు. -గీతాప్రబోధ సూక్తుల ఆటో స్టికర్ల ఆవిష్కరించిన మాజీ మంత్రి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు నవంబర్ 15:**
మానవుడు నిజజీవితంలో అడుగడుగునా సరైన మార్గాన నడుచుటకు భగవద్గీత ఒక దీపస్థంభముగా తోడ్పడుతుందని, ప్రతివ్యక్తి భగవద్గీతను చదివి, ఆచరించాలని మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి టి. జి. వెంకటేశ్ అన్నారు. కర్నూలు నగరం, నర్సింగరావుపేటలోని శ్రీ గీతా ప్రచార ధామం నందు గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో సమాజానికి ఉపయుక్తమయ్యే భగవద్గీత సూక్తులను ఆటోలకు అతికించారు. ఇంతటి మంచి సమాజ కార్యం చేస్తున్న గీతా ప్రచార ధామం నిర్వాహకులను వారు



అభినందించారు. ఈ కార్యక్రమంలో డి.వి.రమణ, గోరంట్ల రమణ, జగన్నాథ గుప్తా, సింహాద్రి రమేష్,



ఇల్లూరు రమణ, అవోపా నాగేశ్వరరావు, మహాబలేష్, నాగోజి, గోవిందరాజు, వివిధ ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా రామకృష్ణ నేచర్ క్యూర్ అండ్ యోగా క్లినిక్

# మొదటి వార్షికోత్సవ దినోత్సవం.!












**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 15:**
స్థానిక నంద్యాలలోని భరతమాత వీధి లో ఉన్న రామకృష్ణ నేచర్ క్యూర్ అండ్ యోగా క్లినిక్ నందు మొదటి వార్షికోత్సవ దినోత్సవం యోగ మరియు ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్. జి. రామకృష్ణారెడ్డి వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ సహదేవుడు, భవనాశి వాసు, భవనాశి నాగ మహేష్, రెడ్డి సంఘం అధినేత ఆర్.వి సుబ్బారెడ్డి మరియు చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ అధికారి లీలావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలో మొట్టమొదటిసారిగా ఇలాంటి ప్రకృతి సిద్ధమైన వైద్యం మన నంద్యాలలో రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాము అని అన్నారు. అలాగే డాక్టర్ .జి.రామకృష్ణ చేస్తున్నటువంటి వైద్య సేవలు గురించి తెలియజేస్తూ రామకృష్ణ నేచర్ క్యూర్ అండ్ యోగ క్లినిక్ నందు చక్కటి సదుపాయాలతో చక్కటి స్టాఫ్ తో మసాజ్ , స్టీమ్, వాటర్ థెరపీ, ఇంకా అనేకమైన పరికరాలతో ఎటువంటి రోగమైన నయం చేయగలిగిన మరీ ముఖ్యంగా మాకు ఇటువంటి రోగం ఉంది అని భయంతో వచ్చిన పేషెంట్లకు డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి ఒక ధైర్యాన్ని ఇస్తూ సహనంతో వారి యొక్క వ్యాధులు ఏమున్నాయో అని విని ఎవరికి ఎటువంటి చికిత్సఅవసరం ఉందని తెలుసుకొని ఎన్నో సంవత్సరాలుగా నడుము నొప్పి , మోకాళ్ళ నొప్పులతో బాడీపెయిన్స్ తో సతమతమవుతున్నటువంటి సమస్యలకు చక్కటి ప్రకృతి సిద్ధమైన వైద్యం ఇక్కడ ఈ రామకృష్ణ నేచర్ క్యూర్ అండ్ యోగా క్లినిక్ నందు అందుబాటులో ఉంది అని చెప్పారు . డాక్టర్ జి.రామకృష్ణ మాట్లాడుతూ యొక్క ఈ రామకృష్ణ నేచర్ క్యూర్ అండ్ యోగ క్లినిక్ నందు మొదటి వార్షికోత్సవం దినోత్సవం సందర్భంగా ఆర్ కే. ఎన్వైసీ నేచురల్స్ అనే ఒక బ్రాండ్ నీ ఆవిష్కరించడం జరిగింది అన్నారు. ఈ బ్రాండ్ లో భాగంగా హెర్బల్ ప్రొడక్ట్స్, ఈటేబుల్ ప్రొడక్ట్స్ ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా ఒక ప్రత్యేకమైన ఆఫర్ అందజేయడం జరుగుతుంది అని అనగా ఈరోజు నుండి 15.11.2025 వ తేదీ శనివారం నుండి వచ్చే శనివారం వరకు ఎవరైతే ఈరోజు ఆవిష్కరించినటువంటి ప్రొడక్ట్స్ ని 300రూ. పైగా కొనుగోలు చేసిన వారందరికీ నేచురల్ ట్రీట్మెంట్ గిఫ్ట్ కార్డ్ కింద ఇవ్వడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అలాగే ఈ మొదటి సంవత్సరంలోనే ఇప్పటికీ వరకు మా యొక్క నేచర్ క్యూర్ అండ్






క్లినిక్ నందు దాదాపు 800 మంది కి పైగా పేషెంట్లకు విజయవంతంగా నయం చేశామని చెప్పడానికి సంతోషంగా ఉంది అని చెప్పారు. అలాగే ముందు ముందు ఎంతోమందికి ఎలాంటి మందులు లేకుండా శస్త్ర చికిత్సలు లేకుండా ప్రకృతి సిద్ధమైన వైద్యాన్ని మా సహాయ సహకారాలని అందిస్తామని తప్పకుండా నంద్యాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# వన్యప్రాణి అడవి పందిని వేటాడిన కేసులో ముద్దాయిలు అరెస్ట్.



**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు నవంబర్ 15:** నంద్యాల నవంబర్ 26 బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామ సమీపములో కె.సి. కెనాల్ దగ్గర అడవి పందిని వేటాడిన కేసునందు పారిపోతున్న ముద్దాయిలను పట్టుకున్న అటవీశాఖ అధికారులు ఈర్నపాడు గ్రామానికి చెందిన 1) కల్లూరి వెంకట రమణ తండ్రి వెంకటేశ్వర్లు, ఈర్నపాడు గ్రామము, 2) కల్లూరి శ్రీనివాసులు తండ్రి వెంకటేశ్వర్లు ఈర్నపాడు గ్రామము, 3) కలడి ఈశ్వరయ్య తండ్రి రాముడు, ఈర్నపాడు గ్రామము ముద్దాయిలను అరెస్టు చేయడంజరిగింది. ఇందుమూలంగా ప్రజలందరికి తెలియయునది ఏమనగా వన్యప్రాణులను వేటాడిన, వాటి మాంసమును కొనడం మరియు అమ్మడం చేసిన అటవీ వన్యప్రాణి చట్టము 1972 ప్రకారం నేరమని వన్యప్రాణులను వేటాడిన వారికి 7 సంవత్సరాలు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును, కావున ప్రజలందరూ వన్యప్రాణుల ను వేటాడకుండా సంరక్షించాలని అటవీశాఖ అధికారులుజెడ్.నాసర్,బండి ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి హెచ్చరించారు. వన్యప్రాణులను వేటాడిన వారి సమాచారంను ఇచ్చినచో వారికి తగిన పారితోషికం ఇచ్చి వారి వివరములు గోప్యంగా ఉంచబడును వివరాలను 9885509574 నంబరుకు తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమం నందు జి.రామకృష్ణ ఎఫ్ఎస్ఓ గడిగుండం సెక్షన్,వై.నాగేంద్రయ్య,ఎఫ్ఎస్ఓ మొబైల్ పార్టీ నంద్యాల మరియు బి.పరమేశ్వరి ఎఫ్బిఓ, ప్రేమ బీటు వారు పాల్గొనడమైనది.

# ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు ముళ్లపోదలు తొలగింపు.

## ఎస్సీ స్మశాన వాటికల్లో ముళ్ళ పొదలు తొలగింపు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ నవంబర్ 15:** మండల కేంద్రంలోని శిరివెళ్ళ మేజర్ గ్రామపంచాయతీలో గల ఎస్సీ మరియు క్రిస్టియన్ స్మశాన వాటికలలో ఆళ్ళ గడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు శనివారం ముళ్ల పొదలు తొలగించినట్లు టిడిపి యువనేత ఎస్సీ కాలనీ బూత్ కన్వీనర్ గిత్తల రాజు పేర్కొన్నారు. స్మశాన వాటికలో దట్టంగా ముళ్ళకంప పిచ్చి మొక్కలు అలముకొని ఉండడం వల్ల దహన సంస్కారాలకు భూస్థాపిత కార్యక్రమాలకు ఆటంకంగా అసౌకర్యంగా ఉన్నాయని ఆయా కాలనీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి మరియు గ్రామపంచాయతీ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఇఓ అశ్వని కుమార్ స్పందించి స్మశాన వాటిక లోని ముళ్లపొదలను తొలగించేందుకు ఆదేశించినట్లు రాజు తెలియజేశారు.
స్మశాన వాటికలో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వర్క్ ఎస్టిమేషన్ పంపించినట్లు ఈఓ అశ్విన్ కుమార్ తెలియజేశారు.
ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ఈఓ అశ్విన్ కుమార్ చేపట్టిన పనులకు హర్షం వ్యక్తం చేశారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి వాతావరణ కాలుష్యాన్ని నివారించాలి.

**డోన్ ఆర్డిఓ కె పి. నరసింహులు.**

**డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్.**

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**




**ఆంధ్ర ప్రగతి డోన్ నవంబర్ 15:** స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా నవంబర్ నెల " పర్సనల్ అండ్ కమ్యూనిటీ హైజిన్ థీమ్ " సందర్భంగా ప్రజలకు అవగాహణ కల్పించి మున్సిపల్ ఆఫీసు నుండి పాతబస్టాండ్ వరకు ర్యాలి చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డోన్ ఆర్డిఓ కె పి. నరసింహులు పాల్గొన్నారు. పాతబస్టాండ్ లో మానవహారం నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ పర్సనల్ అండ్ కమ్యూనిటీ హైజిన్ థీమ్ యొక్క ప్రతిజ్ఞ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత థీమ్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన "స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్" పై అవగాహణ కల్పించారు. పట్టణంలోని పాతబస్టాండ్ లో డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డిఓ కె పి. నరసింహులు, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ,సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సమాజ పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు తెలిపారు. అపరిశుభ్రత వల్ల వాయు కాలుష్యం మరియు గుండె,రక్త ప్రసరణ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. గాలిలోని సూక్ష్మ కణాలు రక్తప్రవాహంలోకి ప్రవేశించి, ఇన్ఫ్లమేషన్‌కు కారణమవుతాయి. దీనివల్ల గుండెపోటు మరియు స్ట్రోక్ వంటి ప్రమాదాలు పెరుగుతాయి. అలాగే పట్టణంలో పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహణ కల్పిస్తూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు, మన ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొదలుపెట్టాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలందరు ఆరోగ్యం,కాలుష్యం పై అవగాహణ కలిగి ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు వృద్ధి చెందకుండా దోమకాటు నుంచి వచ్చేవిష జ్వరాల నుంచి కాపాడుకోవచ్చని తెలియజేశారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి. వాతావరణ కాలుష్యానికి హానికరమైన ప్లాస్టిక్ నిరోధించాలి. ప్లాస్టిక్ ని వాడకుండా మన ఆరోగ్యాలు మనమే కాపాడుకోవాలి. విరివిగా మొక్కలు నాటి మహావృక్షాలుగా తయారు చేసి వాతావరణ కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పరిరక్షణ - ఓజోన్ పొరను రక్షించుకోవాలని తెలిపారు. నీటిని వృధా చేయకుండ జలసంక్షోభాన్ని
అరికట్టాలని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ ,సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అదికారులు, సచివాలయ సెక్రెటరిలు, సిబ్బంది మరియు స్వయం సహాయక బృందాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రాలో అందరూ భాగస్వాములు కావాలి :డి పి ఓ.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల నవంబర్ 15:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై పరిశుభ్రమైన రాష్ట్ర నిర్మాణానికి కృషి చేయాలని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిని పేర్కొన్నారు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యా వసతి నిలయంలో ఈవో అశ్వినీ కుమార్ అధ్యక్షతన జిల్లా పంచాయతీ అధికారి మరియు ఎంపీడీవో సి శివమల్లేశ్వరప్ప నోడల్ అధికారి పాల్గొన్నారు ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ ప్రతినెల స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయడంతో పాటు నివాస ప్రాంతాలే కాకుండా మనం సంచరించే రహదారులు పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకొంటూ పరిశుభ్ర తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు.. చెత్తాచెదారం తొలగింపు, ప్లాస్టిక్ కవర్లు పేపర్లు వాడకుండా పేపర్ బ్యాగులను కవర్లను వాడుతూ ప్రభుత్వం చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై పరిశుభ్రమైన సమాజం కోసం కృషి చేయాలని డిపిఓ పిలుపునిచ్చారు.

# సీఐ సతీష్ కుమార్ మృతిపై సిబిఐ విచారణ జరిపి దోషులను శిక్షించాలి.

## జాతీయ బిసి సంక్షేమ సంఘము జిల్లా అధ్యక్షులు చింతకుంట కురుమూర్తి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 15:**
సీఐ సతీష్ కుమార్ ది అనుమానస్పద మృతి కాదని హత్యానని మృతి పై కూటమి ప్రభుత్వం సిబిఐ కి అప్పగించి హత్య చేసిన నిందితులను శిక్షించి మృతుని కుటుంబనికి న్యాయం చేయాలని అయన కోరారు.

రాష్ట్రంలోని శాలివాహన సంఘాలు మరియు బిసి సంఘాల నేతలు సతీష్ మృతిపై ఆవేదనతో ఉన్నారని. ఒక కేసులో సాక్షిగా ఉన్న సతీష్ కు భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం కూడా వైఫల్యం చెందిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గురైన సతీష్ ఒక సామాన్యమైన వ్యక్తి ఒక మామూలు మనిషి కాదని ఒక పోలీస్ అధికారి అని ఈ హత్యతో



రాష్ట్రంలోని పోలీసులు కూడ అభద్రత భావంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు... రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సతీష్ కుమార్ హత్యపై నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా శాలివాహన సోదర సోదరీమణులు ఉద్యమానికి సిద్ధపడతాయని కలిసి వచ్చే బీసీ కుల సంఘాలు ప్రజాసంఘాలను కలుపుకొని సతీష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని రాష్ట ప్రభుత్వం వెంటనే ఈ కేసు దర్యాప్తును కేంద్ర ప్రభుత్వం నికి పంపించాలని సీబీఐ కేసు విచారణ చేపట్టాలని అక్కడనే న్యాయం జరుగుతుందని తెలియజేసారు.

## కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో భారీగా నియామకాలు..

## 15 వేల పోస్టులకు నోటిఫికేషన్

**నవంబర్ 15 ఆంధ్ర ప్రగతి**
దేశవ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి(ఎన్వీఎస్)లలో ఖాళీగా ఉన్న దాదాపు 15 వేల పోస్టుల భర్తీకి సీబీఎస్ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. టీచింగ్, నాన్ %-% టీచింగ్ పోస్టుల భర్తీకి ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 14 నుంచే ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. దరఖాస్తులకు తుది గడువు డిసెంబర్ 4 గా పేర్కొంది. అసిస్టెంట్ కమిషనర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీఎస్), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ సహా లైబ్రేరియన్ వంటి నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ లో 9,126 పోస్టులు, నవోదయ విద్యాలయ సమితిలో మొత్తం 5,841 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది.

# రాహుల్ రాజకీయ అపరిపక్వత

**నవంబర్ 15ఆంధ్ర ప్రగతి**
బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పులో విపక్షం పట్ల విముఖత ప్రతిబింబించింది. అధికార కూటమికి 202 సీట్లు లభించడం అన్నది లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ప్రతిపక్ష కూటమి మహాగ‌ర్ బంధన్‌కు కేవలం 35 సీట్లు మాత్రమే లభించం ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించినా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. ప్రక్రియ మొత్తం తప్పుగా సాగిందన్నారు. బిహార్ ఎన్నికల వార్తలు, ఎన్నికల పరిణామాల విశ్లేషణలు, కథనాలు నివేదించడంలో మీడియా ఎప్పటికప్పుడు వివరిస్తున్నా రాహుల్ మాత్రం మాయలో న ఉంచి బయటపడడం లేదు. కులాభిమానాల ప్రాతిపదికన ప్రజలు ఓటు వేస్తారనడానికి లేదు. నితీశ్ కుమార్‌కు నష్టదాయకమయ్యేలా ప్రభుత్వ వ్యతిరేకత కనిపించలేదు. జన్ సురాజ్ నాయకుడు ప్రశాంత్ కిశోర్ ప్రయత్నాలు కూడా ఫలించలేదు. అయితే ఓటర్లు ఆయన్ను కొత్తగా రంగంలోకి వచ్చిన నాయకుడు గా మాత్రమే పరిగణించారు. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజల విషయాలను ప్రస్తావించడంలో కరాహుల్ విఫలం అయ్యారు. ఇరవై సంవత్సరాల నితీశ్ కుమార్ ప్రభుత్వ పాలనను కూడా గుర్తు చేసుకున్నారు. అయితే అనేక రంగాలలో నితీశ్ పాలనా తీరును కూడా ప్రజలు గుర్తు చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో బిహారీలు ఓటు వేసిన తీరుతెన్నులకు ఎవరూ సహేతుకమైన వివరణ ఇవ్వలేకపోతున్నారు. బిహార్ ప్రజలను ఒక ప్రత్యామ్నాయ దార్శనికతతో ఉత్తేజితులను చేయడంలోను, మార్పునకై ఒక ప్రగాఢ ఆకాంక్షను వారి మనసుల్లో నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చేలా కార్యకర్తలను పురిగొల్పకపోతే ప్రయోజనమేముంది. బిహార్‌లో భారతీయ జనతాపార్టీకి, జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి అటువంటి సంస్థాగత దన్ను ఉన్నదని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తిరుగులేని రీతిలో రుజువు చేశాయి. ఎన్నికలు సమీపించిన తరుణంలో బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇకపోతే హామీలు కూడా బాగా పనిచేశాయి. రూ.10వేల నగదు బదిలీ ఓటర్లకు లంచంగా ఇవ్వడమే, సందేహం లేదు. అధికార కూటమి అనేక హామీలు ఇచ్చింది. కొత్త ప్రభుత్వం ఆ వాగ్దానాలు అన్నిటినీ నెరవేరుస్తుందా? చూడాలి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి మహిళలు, అత్యంత వెనుకబడిన వర్గాల ఓట్లు పెద్ద ఎత్తున పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో పురుషులతో (62.8) పోలిస్తే ఓటేసిన మహిళల శాతం (71.6) దాదాపు 9 శాతం ఎక్కువ. ఏవీటిలో ఎక్కువ శాతం ఎన్డీయే కూటమి అభ్యర్థులకే పడ్డాయి. ముఖ్యంగా.. ఎన్నికలకు ముందు ఆగస్టు 29న నితీశ్ సర్కారు ప్రకటించిన 'ముఖ్యమంత్రి



మహిళా రోజ్‌గార్ యోజన'ను గేమ్ చేంజర్‌గా చెప్పొచ్చు. ఆ పథకం కింద.. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు వ్యాపారం చేసుకోవడానికి సీడ్‌మనీ కింద రూ.10 వేలు చొప్పున పంపిణీ చేశారు. 1.4 కోట్ల మంది బిహారీ మహిళలకు ఈ సొమ్ము సరిగ్గా ఎన్నికలకు ముందు అందింది. అలాగే.. బాలికలకు ఉచిత విద్య, సైకిళ్లు, యూనిఫారాల వంటి పథకాలు, వితంతు పింఛన్ల పెంపు వంటి పథకాలతో మహిళల ఓట్లు పెద్ద ఎత్తున ఎన్డీయేకిపడ్డాయి. ముస్లింలు, యాదవుల(ఎంవై) ఓట్లపై కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి గట్టిగా నమ్మకం పెట్టుకుంటే.. వారికి దీటుగా ఎన్డీయే కూటమి మహిళలు-ఈబీసీలు మంత్రాన్ని పఠించింది. బీజేపీ ఒకవైపు సంప్రదాయ అగ్రకులాలవారి ఓట్లపై దృష్టి సారించగా.. జేడీయూ కుర్మీలు, ఈబీసీల ఓట్లపై దృష్టి సారించిందిమరోవైపు.. కూటమిలోని లోక్‌జనశక్తి, రాష్ట్రీయ లోక్ మోర్చా, హిందుస్థానీ అవామ్ మోర్చా పార్టీలు దళితులు, వెనుకబడిన వర్గాల ఓట్లను రాబట్టడంలో కీలకపాత్ర పోషించాయి. సీమాంచల్ ప్రాంతంలో ముస్లింల ఓట్లు అత్యధికంగా మజ్లిస్ పార్టీకే పడ్డాయి. ముస్లిం ఓట్లలో చీలిక.. మహాగ‌ర్‌బంధన్ కు బలమైన పట్టున్న ప్రాంతాల్లో కూడా ఓటమికి కారణమైంది. ఆర్జేడీకి కోర్ ఓట్ బ్యాంకు అయిన యాదవుల ఓట్లు సైతం ఈసారి చీలి.. కొందరు ఎన్డీయేవైపు మొగ్గుచూపినట్టు సమాచారం.

తొలగని జంగిల్‌రాజ్ భయం: బిహార్ ఓటర్లలో చాలామందికి.. ఒకప్పటి జంగిల్ రాజ్ భయం ఇంకా తొలగిపోలేదు. బిహారీలనగానే ఇతరప్రాంతాల్లో ఒకప్పుడు చిన్నచూపు చూసే పరిస్థితి ఉండేదని.. నితీశ్ పాలనతో ఆ మరక పోయి, బిహార్‌ను గౌరవంగా చూస్తున్నారనే భావన చాలా మంది బిహారీల్లో ఉంది.

ఎప్పటిలాగానే ఈసారి కూడా బిహార్‌లో మోదీ మ్యాజిక్ కొనసాగింది. ఆయన సభలు, సంక్షేమ పథకాలు.. తటస్థంగా ఉన్న ఓటర్లను ఎన్డీయే వైపు సంఘటితం చేయడంలో కీలకపాత్ర పోషించాయి. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 13 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. పట్నాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. చొరబాటుదారులకు ఆర్జేడీ-కారగ్రెస్ మద్దతు ఉందని.. ఆ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని దోచుకుతిన్నాయని, ఆటవిక పాలన కొనసాగించాయని పదేపదే గుర్తుచేశారు. రాష్ట్రంలోని పెద్దలందరూ ఆర్జేడీ పాలనలో సాగిన అరాచకాల గురించి ఈ తరం యువతకు తెలపాలని పిలుపునిచ్చారు. దీనిపై విస్తృతంగా జరిగిన చర్చ ఓటర్లపై బాగా ప్రభావం చూపింది. ఇవన్నీ విశ్లేషించని రాహుల్ తనదైన ర ఈతిలో విమర్శలు చేయడం ఆయన రాజకీయ అపరిపక్వతను సూచించింది.

## నౌగామ్ పోలీస్ స్టేషన్ పేలుడు ఉగ్రకుట్ర కాదు

**అనుకోకుండా జరిగిన ప్రమాదమే**

**జమ్మూ కాశ్మీర్ డీజీపీ నలిన్ ప్రభావత్ వెల్లడి**

**ప్రమాదంపై ఊహాగానాలు వద్దు**

**: కేంద్ర హెూంశాఖ**



శ్రీనగర్,**నవంబర్ 15ఆంధ్ర ప్రగతి** శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన భారీ పేలుడు ఉగ్రవాదుల దాడి కాదని.. ఇది పూర్తిగా ప్రమాదవశాత్తూ జరిగిందని జమ్మూ కాశ్మీర్ డీజీపీ నలిన్ ప్రభావత్ స్పష్టం చేశారు. ఫోరెన్సిక్ పరీక్షల కోసం పేలుడు పదార్థాల నుంచి నమూనాలు తీస్తుండగా ఈ విస్ఫోటనం సంభవించిందని.. ఈ ఘటనలో తొమ్మిది మంది మరణించగా, 29 మంది గాయపడ్డారని తెలిపారు. మరోవైపు పీపుల్స్-యాంటీ ఫాసిస్ట్ ఫోర్స్ అనే ఉగ్రవాద సంస్థ ఈ దాడికి తామే బాధ్యులమని ప్రకటించింది. కానీ డీజీపీ మాత్రం ఇది అబద్ధం అని వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్ శివార్లలో ఉన్న నౌగామ్ పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన భారీ పేలుడుతీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘోర దుర్ఘటనలో ఇప్పటి వరకు తొమ్మిది మంది మరణించగా.. 29 మంది గాయపడ్డారు. భారీ పేలుడు కారణంగా ఈ ఘటన వెనుక ఉగ్ర కుట్ర ఉండవచ్చు అనే ఊహాగానాలు వ్యాపించాయి. అయితే ఈ ఊహాగానాలను జమ్మూ కాశ్మీర్ డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) నలిన్ ప్రభావత్ పూర్తిగా తోసిపుచ్చారు. డీజీపీ నలిన్ ప్రభావత్ మీడియాతో మాట్లాడుతూ.. "ఈ పేలుడు ఉగ్రవాదులు చేసిన దాడి కాదు. ఇది పూర్తిగా ప్రమాదవశాత్తూ జరిగింది" అని స్పష్టం చేశారు. పేలుడుకు సంబంధించిన పరిస్థితులను, దర్యాప్తు వివరాలను ఆయన మీడియాకు వివరించారు.నౌగామ్ పోలీస్ స్టేషన్‌లోని అధికారులు ఇటీవల హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఛేదించిన ఉగ్ర మాడ్యూల్‌కు సంబంధించిన కీలకమైన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద మొత్తంలో ఉన్న ఈ పేలుడు పదార్థాల నుంచి ఫోరెన్సిక్ పరీక్షల కోసం శాంపిల్స్ (నమూనాలు) తీస్తున్న సమయంలోనే ఊహించని విధంగా భారీ విస్ఫోటనం జరిగింది. ఈ ప్రమాదంలో పోలీస్ స్టేషన్ భవనం దెబ్బతినడమే కాకుండా అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు, ఫోరెన్సిక్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే.. చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు అనుభవించినట్లు స్థానికులు తెలిపారు. అంతేకాకుండా పేలుడు ధాటికి శిథిలాలు, శరీర భాగాలు వందల మీటర్ల దూరం వరకు ఎగిరి పడ్డాయి.నౌగామ్ ఘటన ప్రమాదమే అని అధికారులు భావిస్తుండగా.. పీపుల్స్-యాంటీ ఫాసిస్ట్ ఫోర్స్ అనే ఉగ్రవాద సంస్థ ఈ దాడికి తామే బాధ్యులమని ప్రకటించింది. ఈ పీఏఎఫ్ఎఫ్ సంస్థ.. పాకిస్థాన్ ఆధారిత ఉగ్ర సంస్థ జైష్-ఎ-మహ్మద్‌కు అనుబంధంగా పని చేస్తుందని భద్రతా సంస్థలు గుర్తించాయి. అయితే డీజీపీ నలిన్ ప్రభావత్ ఈ ఉగ్ర సంస్థ చేసిన ప్రకటనను ఖండించారు. వారు కేవలం గందరగోళం సృష్టించడానికి, భయాందోళనలు రేకెత్తించడానికి మాత్రమే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. తమ దర్యాప్తులో స్పష్టంగా ఇది సాంకేతిక కారణాల వల్ల జరిగిన ప్రమాదంగా తేలిందని ఆయన బలంగా చెప్పారు. ప్రస్తుతం గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. ఉగ్ర కుట్ర కోణంలోనూ దర్యాప్తు చేసినప్పటికీ.. ఈ పేలుడు ప్రమాద వశాత్తే జరిగినట్లు తేలిందని వెల్లడించారు. పేలుడుపై కేంద్ర హెూం మంత్రిత్వశాఖ శనివారం స్పందించింది. ఈ పేలుడు ధాటికి 9మంది మరణించగా, 32మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. ఈ ఘటనలో ఉగ్రకోణం ఉందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎంహెచ్ఏ వివరణ ఇచ్చింది. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందని, దీనిపై ఊహాగానాలు అనవసరమని కేంద్ర హెూం మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే స్పష్టం చేశారు.హరియాణాలోని టెర్రర్ మాడ్యూల్‌పై దర్యాప్తు చేస్తున్న సమయంలో భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు, రసాయనాల నిల్వలను స్వాధీనం చేసుకున్నాం. వాటిని శ్రీనగర్ శివార్లలో ఉన్న నౌగామ్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని బహిరంగ ప్రదేశంలో భద్రంగా ఉంచాం. తరువాత వాటిని ప్రామాణిక, నిర్దేశిత విధానంలో ఫోరెన్సిక్, రసాయన పరీక్షకు పంపాం. భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు ఉండడం వల్ల గత రెండు రోజులుగా ఈ ప్రక్రియ నిరంతరంగా జరుగుతూనే ఉంది. అయితే ఆ పేలుడు పదార్థాలు చాలా సున్నితమైనవి కావడం వల్ల, నిపుణుల పర్యవేక్షణలో వాటిని జాగ్రత్తగా నిర్వహిస్తున్నాం. అయితే నవంబర్ 14 రాత్రి 11.20 గంటల సమయంలో ప్రమాదవశాత్తు భారీ పేలుడు సంభవించింది. ఈ దురదృష్టకరమైన ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోగా, 27 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు గాయపడ్డారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ తీవ్రంగా దెబ్బతింది. చుట్టుపక్కల ఉన్న కొన్ని భవనాలు కూడా దెబ్బతిన్నాయి. పేలుడుకు గల కారణాలను పరిశీలిస్తున్నారు. దీనిపై ఊహాగానాలు అనవసరమని అన్నారు. ఇంతకు ముందు జమ్మూకశ్మీర్ పోలీస్ చీఫ్ నళిన్ ప్రభాత్ మాట్లాడుతూ, నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడు ప్రమాదవశాత్తు జరిగిందని, ఎలాంటి ఉగ్రదాడి జరగలేదని పేర్కొనడం గమనార్హం.ఇటీవలే దిల్లీలో ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద భారీ పేలుడు సంభవించింది.

## ఫరీదాబాద్‌లో అర్ధరాత్రి పేలుడు

**పేలుడు పదార్థాలు పరిశీలిస్తుండగా ప్రమాదం**

**మొత్తం 9మంది మృత్యువాత**

శ్రీనగర్,**నవంబర్ 15ఆంధ్ర ప్రగతి** జమ్మూకశ్మీర్ ఫరీదాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో మొత్తం తొమ్మండుగురు మృతి చెందగా 27 మందికి తీవ్రగాయాలయ్యాయి. పేలుడు దాటికి పోలీస్ స్టేషన్‌లో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఫరీదాబాద్‌లో ఇటీవల స్వాధీనం చేసుకున్న అమ్మోనియం నైట్రేట్ నిల్వల శాంపిల్స్‌ను పరిశీలిస్తుండగా పేలుడు జరిగినట్లు తెలుస్తోంది. ఢిల్లీ ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దర్యాప్తులో నౌగామ్ పోలీసులు అనుమానిత ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఫరీదాబాద్‌లోని ఓ ఇంట్లో ఇటీవల సోదాలు నిర్వహించిన పోలీసులు.. 360 కిలోల పేలుడు పదార్థాలను గుర్తించారు. అలాగే పలు ఆయుధాలు కూడా బయటపడడంతో అన్నింటినీ స్వాధీనం చేసుకుని, నౌగామ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి పేలుడు పదార్థాల నుంచి నమూనాలను సేకరిస్తుండగా.. ప్రమాదవశాత్తు పేలుడు సంభవించింది. పేలుడు దాటికి మృతదేహాల విడిభాగాలు. సుమారు 300 మీటర్ల దూరం వరకూ ఎగిరి పడ్డాయి. చనిపోయిన వారి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనలో మొత్తం 24 మంది పోలీసులు, ముగ్గురు స్థానికులు గాయపడినట్లు తెలిపారు. వారంతా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

## అనుమతి ఉన్న బెట్టింగ్ యాప్ అని ప్రచారం చేశాను

**సినీ నటుడు రానా దగ్గుబాటి వెల్లడి**

**బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం కేసులో సిట్ విచారణ**



హైదరాబాద్,**నవంబర్ 15ఆంధ్ర ప్రగతి** హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో సినీ నటుడు రానా దగ్గుబాటి సిట్ విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేసింది. ఇవాళ సీఐడీ సిట్ విచారణకు యాంకర్ విష్ణుప్రియ సైతం వచ్చారు. బెట్టింగ్ యాప్ ప్రచారానికి సంబంధించి విష్ణుప్రియను సిట్ అధికారులు ప్రశ్నించారు.బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం కేసులో రానాను దాదాపు గంటన్నర పాటు సీఐడీ అధికారులు పలు కోణాల్లో ప్రశ్నించినట్లు ప్రశ్నించారు. అనుమతి ఉన్న యాప్ అని తెలిశాకే ప్రచారం చేశానట్లు రానా అధికారులకు చెప్పినట్లు తెలిపారు. ఆ యాప్ గురించి తన న్యాయ బృందం విచారణ చేసిందని వెల్లడించారు. దీనిపై సీఐడీ అధికారులకు పూర్తిగా వివరించినట్లు పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రముఖ సినీతారలు, సెలబ్రిటీలు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించడంతో పలువురు యువకులు వాటికి బానిసలై ప్రాణాలు పోగొట్టుకున్నారంటూ పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. దీంతో వాటి విచారణకు తెలంగాణ సీఐడీ అదనపు డీజీపీ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆయా కేసుల్లో విజయ్ దేవరకొండతో పాటు సినీ నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, విష్ణుప్రియ, సిరి హనుమంత్ సహా మొత్తం 29 మంది నిందితులుగా ఉన్నారు. ఇప్పటికే పలువురు సెలబ్రెటీలను సిట్ అధికారులు విచారణ చేశారు. అందులో విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్‌ను సిట్ ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

## ఏపీకి వరంగా మారిన బీహార్ విజయం..!

**నవంబర్ 15ఆంధ్ర ప్రగతి**



బీహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ విజయం దక్కించుకుం ది. మొత్తం 243 స్థానాలకు గాను 208 స్థానాల్లో విజయం దక్కించుకుంది. అయితే.. ఈవిజయానికి ఏపీకి మధ్య లింకు ఉందా? అంటే.. ఉందనే అంటున్నారు పరిశీలకులు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఎన్డీయే కూటమిపై గత కొన్నాళ్లుగా నీలినీడలు కమ్ముకున్నాయి. ఇలాంటి సమయంలో అనూహ్యంగా బీహార్ ఘన విజయం ఆ కూటమికి భారీగా కలిసివచ్చింది. ఏపీ విషయానికి వస్తే.. డబుల్ ఇంజన్ సర్కారుతో ఏపీ దూసుకుపోతోందని సీఎం చంద్రబాబు చెబుతు న్నారు. మంత్రి నారా లోకేష్ మరో అడుగు ముందుకు వేసి.. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు అంటున్నారు. ఈ క్రమంలో డబుల్ ఇంజన్ సర్కారు ఇప్పుడు బీహార్‌లోనూ విజయం దక్కించుకోవడంతో ఏపీలో మరింతగా బీజేపీ-టీడీపీ-జనసేనలు పుంజుకునే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. వచ్చే 2029 నాటికి వీరి మధ్య బంధం మరింత పెరుగుతుందన్న అవకాశం కూడా ఉంటుందని చెబుతున్నారు. బీహార్ విజయాన్ని కేవలం ఆ రాష్ట్రానికే పరిమితం చేయడానికి వీల్లేదు. దేశవ్యాప్తంగా ఎన్డీయే కూటములు ఉన్న ప్రభుత్వాలకు కూడా అన్వయించినప్పుడు.. ఆయా రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలకు ఈ విజయం మరింత ఆక్సిజన్ అందిస్తుందన్నది పరిశీలకులు చెబుతున్నమాట. ముఖ్యంగా తటస్థ ఆలోచనలు ఉ న్న ఏపీలో బీహార్ ఫలితం మరింతగా కూటమి నేతలను ఒక్కటి అయ్యేలా చేస్తుందని కూడా చెబుతున్నా రు. కూటమిగా ఉంటేనే విజయం అని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు బీహార్‌లోనూ అదే కూటమి విజయం సాకారం అయిన నేపథ్యంలో వచ్చే ఏపీ ఎన్నికల నాటికి కూడా ఎన్డీయే కూటమి ఇదే విధంగా ముందుకు సాగుతుందన్న అంచనా వేస్తున్నారు. ఎన్డీయే కూటమికి బీహార్ ప్రజలు కనీవినీ ఎరుగని విజయాన్ని అందించిన నేపథ్యంలో ఏపీలో ఆయా పార్టీలు మరింత పుంజుకుంటాయని కూడా చెబుతున్నారు. "ఇప్పటి వరకు ఎలా ఉన్నా.. ఇక నుంచి మాత్రం కూటమి మరింత బలోపేతం అవుతుంది" అని బీజేపీకి చెందిన కీలక నాయకుడు ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

# జడేజా స్పిన్ మాయాజాలం

**రెండో ఇన్నింగ్స్ లో కుప్పకూలిన దక్షిణాఫ్రికా**

**భారత్‌పై 63 పరుగుల స్వల్ప ఆధిక్యం**

**భారత్ 189 పరుగులకు ఆలౌట్**

**రసవత్తరంగా సాగుతున్న తొలి టెస్టు**



దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు ఆటలో టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తన స్పిన్‌తో అద్భుతం చేశాడు. పెవిలియన్ ఎండ్ నుంచి సుడులు తిరిగే బంతులు విసిరి సఫారీ బ్యాటింగ్ లైనప్‌ను అతలాకుతలం చేశాడు. జడేజా ధాటికి రెండో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 93 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. కేవలం 63 పరుగుల ఆధిక్యంలో ఉన్న దక్షిణాఫ్రికా ఓటమి అంచున నిలిచింది. ఈ మ్యాచ్ మూడో రోజే ముగిసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శనివారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 189 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత్‌కు 30 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. కేఎల్ రాహుల్ (39), వాషింగ్టన్ సుందర్ (29) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో సైమన్ హార్మర్ 4 వికెట్లు, మార్కో యన్సెన్ 3 వికెట్లతో ఆకట్టుకున్నారు. స్వల్ప ఆధిక్యం మాత్రమే కావడంతో మ్యాచ్ సమంగా ఉందని అంతా భావించారు. దీనికి తోడు మెడ నొప్పితో శుభ్‌మన్ గిల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడం భారత్‌కు ఇబ్బందిగా మారింది. కానీ, భారత స్పిన్నర్లు రంగంలోకి దిగాక మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. ముఖ్యంగా రవీంద్ర జడేజా తన స్పిన్‌తో దక్షిణాఫ్రికా బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. ఈడెన్ గార్డెన్స్ పిచ్ రెండో రోజు స్పిన్నర్లకు స్వర్గధామంగా మారింది. పిచ్ పై పగుళ్ల కారణంగా బంతి అనూహ్యంగా బౌన్స్ అవుతూ, షార్ప్ గా టర్న్ అవ్వడంతో బ్యాటింగ్ చేయడం కష్టసాధ్యంగా మారింది. ఈ అవకాశాన్ని జడేజా అద్భుతంగా సద్వినియోగం చేసుకున్నాడు. ఐడెన్ మార్‌క్రమ్‌ను స్వీప్ షాట్ ఆడేలా ప్రేరేపించి, షార్ట్ లెగ్‌లో ధ్రువ్ జురెల్ చేతికి చిక్కేలా చేశాడు. ఆ తర్వాత కాసేపటికే వియాన్ ముల్డర్‌ను బోల్తా కొట్టించి స్టాండిన్ కెప్టెన్ రిషబ్ పంత్‌కు క్యాచ్ ఇచ్చేలా చేశాడు. అదే ఓవర్‌లో టోనీ డి జోర్జిని కూడా పెవిలియన్‌కు పంపాడు. ట్రిస్టన్ స్టబ్స్‌ను ఒక అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేసి సఫారీల పతనాన్ని శాసించాడు. ఒక ఎండ్‌లో కెప్టెన్ టెంబా బవుమా (29 నాటౌట్) నిలకడగా ఆడుతున్నా, మరో ఎండ్‌లో వికెట్లు టపటపా రాలిపోయాయి. కైల్ వెర్రెయిన్ భారీ షాట్‌కు ప్రయత్నించి అక్షర్ పటేల్ బౌలింగ్‌లో మిడిల్ స్టంప్‌ను పోగొట్టుకున్నాడు. ఆట ముగిసే కొద్ది నిమిషాల ముందు కుల్దీప్ యాదవ్ కూడా తన ఖాతాలో వికెట్ వేసుకున్నాడు. మార్కో యన్సెన్ కొట్టిన బంతిని స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ రెండు ప్రయత్నాల్లో పట్టుకుని దక్షిణాఫ్రికాను మరింత కష్టాల్లోకి నెట్టాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా 63 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ పిచ్‌పై 125 పరుగుల లక్ష్యం కూడా ఛేదించడం కష్టమే. అయితే ఆ లక్ష్యాన్ని నిర్దేశించాలంటే సఫారీలు తమ ప్రస్తుత స్కోరును దాదాపు రెట్టింపు చేయాల్సి ఉంటుంది. చేతిలో కేవలం 3 వికెట్లు మాత్రమే ఉన్నందున అది దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. దీంతో ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ విజయం దాదాపు ఖాయమైనట్లే. మూడో రోజు తొలి సెషన్‌లోనే మ్యాచ్ ఫలితం తేలిపోయే అవకాశాలున్నాయి.

# టెస్టుల్లో పంత్ సరికొత్త చరిత్ర..



టీమిండియా వైస్ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. భారత మాజీ డ్యాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉన్న అత్యధిక సిక్సర్ల రికార్డును పంత్ అధిగమించాడు. దక్షిణాఫ్రికాతో కోల్‌కతా వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో కేశవ్ మహారాజ్ బౌలింగ్‌లో లాంగ్-ఆన్ మీదుగా భారీ సిక్సర్ బాదిన పంత్, ఈ ఫార్మాట్‌లో 92వ సిక్సర్‌ను నమోదు చేశాడు. దీంతో 91 సిక్సర్లతో ఉన్న సెహ్వాగ్ రికార్డు బద్దలైంది. ఇదే మ్యాచ్‌లో టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండో రోజు ఆట ప్రారంభమైన కాసేపటికే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయంతో మైదానాన్ని వీడాడు. కేవలం మూడు బంతులు ఆడిన తర్వాత మెడ నొప్పితో ఇబ్బంది పడటంతో అతడు రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు.

# శుభ్‌మన్ గిల్‌కు గాయం!




సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో మైదానం వీడాడు. వాషింగ్టన్ సుందర్(29) ఔటైన వెంటనే నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన శుభ్‌మన్ గిల్ మూడు బంతులకే పెవిలియన్ బాట పట్టాడు. తొలి రెండు బంతులను డాట్ చేసిన గిల్.. మూడో బంతిని స్లాగ్ స్వీప్ షాట్‌తో బ్యాక్‌వార్డ్ స్క్వేర్ దిశగా బౌండరీ బాదాడు. అయితే ఈ షాట్ ఆడిన అనంతరం అతను మెడ నొప్పితో బాధపడ్డాడు. ఫిజియోలు వచ్చి మాట్లాడగా.. బ్యాటింగ్ చేయలేనని చెప్పాడు. దాంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. అయితే శుభ్‌మన్ గిల్‌కు నిద్రలో మెడ పట్టేసినట్లు తెలుస్తుంది. అయినా జట్టు కోసం అతను బ్యాటింగ్ చేసేందుకు ప్రయత్నించాడు. కానీ తన వల్ల కాకపోవడంతో రిటైర్డ్ హర్ట్‌గా బరిలోకి దిగాడు. మెడ నొప్పి కాస్త తగ్గిన తర్వాత శుభ్‌మన్ గిల్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగే ఛాన్స్ ఉంది. శుభ్‌మన్ గిల్ వెనుదిరగడంతో రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు వచ్చాడు.తనదైన బ్యాటింగ్‌తో దూకుడుగా ఆడిన అతన్ని కార్బిన్ బోష్ తెలవైన బంతితో కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో రోజు ఆట లంచ్ బ్రేక్ సమయానికి భారత్ 45 ఓవర్లలో 4 వికెట్లకు 138 పరుగులు చేసింది. భారత్ ఇంకా 21 పరుగుల వెనుకంజలో ఉంది. క్రీజులో జడేజా(11 బ్యాటింగ్)తో పాటు ధ్రువ్ జురెల్(5 బ్యాటింగ్) ఉన్నాడు.

# 10 ఫ్రాంచైజీల రిటెన్షన్ లిస్టు విడుదల




ఐపీఎల్ 2026 సీజన్ మినీ వేలం నేపథ్యంలో 10 ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను ప్రకటించాయి. ఈ వివరాలను అధికార బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్ వేదికగా వెల్లడించారు. పది జట్లు తమకు అవసరమైన ఆటగాళ్లను రిటైన్ చేసుకొని భారంగా మారిన ప్లేయర్లను వేలంలోకి వదిలేసాయి. అత్యధికంగా కేకేఆర్ 10 మంది ఆటగాళ్లను వదిలేయగా.. అత్యల్పంగా పంజాబ్ కింగ్స్ ఐదుగురు ఆటగాళ్లను మాత్రమే రిలీజ్ చేసింది. దాంతో డిసెంబర్ 16న అబుదాబి వేదికగా జరగనున్న వేలంలో కేకేఆర్ అత్యధికంగా రూ.64.3 కోట్ల పర్స్ మనీతో బరిలోకి దిగనుంది. అత్యధికంగా కేకేఆర్ 10 మంది ఆటగాళ్లను వదిలేయగా.. అత్యల్పంగా పంజాబ్ కింగ్స్ ఐదుగురు ఆటగాళ్లను మాత్రమే రిలీజ్ చేసింది. దాంతో డిసెంబర్ 16న అబుదాబి వేదికగా జరగనున్న వేలంలో కేకేఆర్ అత్యధికంగా రూ.64.3 కోట్ల పర్స్ మనీతో బరిలోకి దిగనుంది. 2. చెన్నై సూపర్ కింగ్స్ రిలీజ్ లిస్ట్: రాహుల్ త్రిపాఠి, వాన్ష్ బేడీ, ఆండ్రూ సిద్దార్థ్, రచిన్ రవీంద్ర, సామ్ కరణ్, దీపక్ హుడా, విజయ్ శంకర్, షేక్ రషీద్, కమలేష్ నాగర్‌కోటి, మతీష పతీరణ. రిటైన్ లిస్ట్: రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్), ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్, మహేంద్ర సింగ్ ధోనీ, ఉర్విల్ పటేల్, సంజూ శాంసన్(ట్రేడ్ ఇన్), దేవాన్ కాన్వే, రవీంద్ర జడేజా, శివమ్ దూబే, జేమీ ఓవర్టన్, రామకృష్ణ ఘోష్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, గుర్జన్‌ప్రీత్ సింగ్, నాథన్ ఎల్లిస్, శ్రేయస్ గోపాల్, ముఖేష్ చౌదరి. 3. సన్‌రైజర్స్ హైదరాబాద్ రిలీజ్ లిస్ట్: అభినవ్ మనోహర్, అథర్వ టైడ్, సచిన్ బేబీ, వియాన్ మల్డర్, మహమ్మద్ షమీ, సిమర్జిత్ సింగ్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాలను రిటైన్ లిస్ట్: ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, ఆర్ సమరన్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, కామిందు మెండిస్, హర్షల్ పటేల్, బ్రైడన్ కార్స్, ప్యాట్ కమిన్స్, జయదేవ్ ఉనాద్కత్, ఇషాన్ మలింగా, జీషన్ అన్సారీ. 4. లక్నో సూపర్ జెయింట్స్ రిలీజ్ లిస్ట్: ఆర్యన్ జుయల్, డేవిడ్ మిల్లర్, యువరాజ్ చౌదరీ, రాజ్‌వర్ధన్ హంగార్గేకర్, శార్దూల్ ఠాకూర్(ట్రేడ్ ఔట్), ఆకాష్ దీప్, రవి బిష్ణోయ్, షమర్ జోసెఫ్‌రిటైన్ లిస్ట్: అబ్దుల్ సమద్, ఆయుష్ బదోని, ఎయిడెన్ మార్క్‌రమ్, మాథ్యూ బ్రిట్జ్‌కే, హిమ్మత్ సింగ్, రిషభ్ పంత్, నికోలస్ పూరన్, మిచెల్ మార్ష్, షెహ్‌బాజ్ అహ్మద్, అర్షిన్ కులకర్ణి, మహమ్మద్ షమీ(ట్రేడ్ ఇన్), మయాంక్ యాదవ్, ఆవేష్ ఖాన్, ఎమ్ సిద్దార్థ్, దిగ్వేష్ రతి, ప్రిన్స్ యాదవ్, ఆకాష్ సింగ్. 5. ఢిల్లీ క్యాపిటల్స్ రిలీజ్ లిస్ట్: ఫాఫ్ డుప్లెసిస్, జాక్ ఫ్రెజర్ మెక్‌గర్క్, డోనావన్ ఫెరైరా(ట్రేడ్ ఔట్), సెదిఖుల్లా అటల్, మానవ్ కుమార్, మోహిత్ శర్మ, దర్షన్ నల్కండే రిటైన్ లిస్ట్: ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, అభిషేక్ పోరెల్, అక్షర్ పటేల్, అషుతోష్ శర్మ, విప్రజ్ నిగమ్, మాదవ్ తివారి, త్రిపుర విజయ్, అజయ్ మండల్, కుల్దీప్ యాదవ్, మిచెల్ స్టార్క్, టీ నటరాజన్, ముఖేష్ కుమార్, దుష్మంత్ చమీరా 6. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రిలీజ్ లిస్ట్: స్వస్తిక్ చికరా, మయాంక్ అగర్వాల్, టీమ్ సిఫెర్ట్, లియామ్ లివింగ్ స్టోన్, మనోజ్ భాండగే, లుంగి ఎంగిడి, బ్లెస్సింగ్ ముజర్బానీ, మోహిత్ రతీ రిటైన్ లిస్ట్:రజత్ పటీదార్(కెప్టెన్), విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, ఫిల్ సాల్ట్, జితేశ్ శర్మ, కృనాల్ పాండ్యా, స్వప్నిల్ సింగ్, టీమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్, జాకోబ్ బెతెల్, జోష్ హాజెల్ వుడ్, యశ్ దయాల్, భువనేశ్వర్ కుమార్, నువాన్ తుషార, రసిక్ సలామ్, అభినందన్ సింగ్, సుయాశ్ శర్మ 7. రాజస్థాన్ రాయల్స్ రిలీజ్ లిస్ట్: కృనాల్ సింగ్ రాథోడ్, నితీష్ రాణా(ట్రేడ్ ఔట్), సంజూ శాంసన్(ట్రేడ్ ఔట్), వానిందు హసరంగా, మహీష్ తీక్షణ, ఫజలక్ ఫరూఖీ, ఆకాశ్ మద్వాల్, ఆశోక్ శర్మ, కుమార్ కార్తికేయ రిటైన్ లిస్ట్: యశస్వి జైస్వాల్, షిమ్రాన్ హెట్‌మైర్, వైభవ్ సూర్యవంశీ, శుభమ్ దూబే, లుహన్ డ్రీ ప్రిటోరియస్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, రవీంద్ర జడేజా(ట్రేడ్ ఇన్), సామ్ కరణ్(ట్రేడ్ ఇన్), డీ ఫెర్రెరియా(ట్రేడ్ ఇన్), జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే, సందీప్ శర్మ, యుధ్‌వీర్ శర్మ, క్వేన్ మఫకా, నంద్రే బర్గర్. 9. పంజాబ్ కింగ్స్ రిలీజ్ లిస్ట్: జోష్ ఇంగ్లీస్, ఆరోన్ హర్డీ, గ్లేన్ మ్యాక్స్‌వెల్, కుల్దీప్ సేన్, ప్రవీణ్ దూబే రిటైన్ లిస్ట్: శ్రేయస్ అయ్యర్, నెహాల్ వధేరా, ప్రియాన్ష్ ఆర్య, శశాంక్ సింగ్, పైలా అవినాష్, హర్నూర్ పన్ను, ముషీర్ ఖాన్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, విష్ణు వినోద్, మార్కస్ స్టోయినీస్, మార్కో జాన్సెన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, సర్యాన్ష్ షెడ్గే, మిచెల్ ఓవెన్, అర్ష్‌దీప్ సింగ్, వైశాఖ్ విజయ్‌కుమార్, యశ్ ఠాకూర్, గ్జేవియర్ బార్ట్‌లెట్, లాకీ ఫెర్గూసన్, యుజ్వేంద్ర చాహల్, హర్‌ప్రీత్ బ్రార్. 10. ముంబై ఇండియన్స్ రిలీజ్ లిస్ట్: సత్య నారయణ రాజు, రీస్ టాప్లీ, కేఎల్ శ్రీజిత్, కర్ణ్ శర్మ, అర్జున్ టెండూల్కర్(ట్రేడ్ ఔట్), బెవాన్ జేకబ్స్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, లిజాడ్ విలియమ్స్, విఘ్నేష్ పుత్తూర్ రిటైన్ లిస్ట్: హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, నమన్ ధీర్, ట్రెంట్ బౌల్ట్, ర్యాన్ రికెల్టన్, దీపక్ చాహర్, విల్ జాక్స్, అశ్వని కుమార్, మిచెల్ సాంట్నర్, రాజ్ బవా, రాబిన్ మింజ్, షెర్ఫేన్ రూథర్‌పోర్డ్(ట్రేడ్ ఇన్), శార్దూల్ ఠాకూర్(ట్రేడ్ ఇన్), మయాంక్ మార్కండే(ట్రేడ్ ఇన్)

# కీలక ఆటగాళ్లపై చెన్నై వేటు..



ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) తమ జట్టును పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైంది. మినీ వేలానికి ముందు ఏకంగా 10 మంది ఆటగాళ్లను వేలంలోకి వదిలేసింది. వేలానికి ముందే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్‌ను ట్రేడ్ చేసుకుంది. అతని కోసం రవీంద్ర జడేజా, సామ్ కరణ్‌ను రాజస్థాన్ రాయల్స్‌కు ఇచ్చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే కీలక ఆటగాళ్లను కూడా సీఎస్‌కే వదులుకుంది.రచిన్ రవీంద్ర, మతీష పతీరణతో పాటు దీపక్ హుడా, విజయ్ శంకర్, తెలుగు తేజం షేక్ రషీద్, కమలేష్ నాగర్‌కోటి, రాహుల్ త్రిపాఠి, వాన్ష్ బేడీ, ఆండ్రీ సిద్దార్థ్‌లను వదిలేసింది. దాంతో సీఎస్‌కే పర్స్ వాల్యూలో రూ. 43.4 కోట్ల భారీ క్యాష్ మిగిలింది. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని సీఎస్‌కే రిటైన్ చేసుకోవడంతో రిటైర్మెంట్ వార్తలకు తెరపడింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా ధోనీ బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. డెవాన్ కాన్వేను వదిలేస్తుందని ప్రచారం జరిగినా.. అది అవాస్తవమని తేలింది. సంజూ శాంసన్ జట్టులోకి వచ్చినా.. రుతురాజ్ గైక్వాడ్ జట్టును నడిపిస్తాడని సీఎస్‌కే ప్రకటించింది. డిసెంబర్ 16న అబుదాబి వేదికగా మినీవేలం జరగనుంది.

# సన్‌రైజర్స్ హైదరాబాద్ రిటైన్ లిస్ట్ విడుదల



ఐపీఎల్ 2026 సీజన్ మినీ వేలానికి రంగం సిద్ధమైంది. డిసెంబర్ 16న అబుదాబి వేదికగా ఈ మినీ ఆక్షన్ జరిగే అవకాశం ఉంది. మినీ వేలానికి ముందు రిటెన్షన్ ప్రక్రియను ప్రారంభించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)..రిటైన్, రిలీజ్ ఆటగాళ్ల జాబితాను సమర్పించేందుకు ఫ్రాంచైజీలకు నవంబర్ 15(శనివారం)న సాయంత్ర 5 గంటల వరకు డెడ్‌లైన్ విధించింది. దాంతో అధికార బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్ వేదికగా 10 ఫ్రాంచైజీల రిటైన్, రిలీజ్ ఆటగాళ్ల జాబితా శనివారం విడుదలైంది.మాజీ ఛాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకంగా 8 మంది ఆటగాళ్లను రిలీజ్ చేసింది. గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపర్చిన అభినవ్ మనోహర్, అథర్వ టైడ్, సచిన్ బేబీ, వియాన్ మల్డర్, మహమ్మద్ షమీ, సిమర్జిత్ సింగ్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాలను వదిలేసింది. అయితే తమ కోర్ టీమ్‌ను మాత్రం ఆరెంజ్ ఆర్మీ రిటైన్ చేసుకుంది.రిలీజ్ చేసిన ఆటగాళ్ల జాబితాలో సిమర్జిత్ సింగ్ కాస్త మెరుగైన ప్రదర్శనే చేశాడు. కానీ అతన్ని కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ వదిలేయడం గమనార్హం. ఈ 8 మంది ఆటగాళ్లను వదిలేయడంతో సన్‌రైజర్స్ రూ.25.5 కోట్ల భారీ ధరతో వేలంలోకి వెళ్లనుంది. జట్టుకు భారమైన ఆటగాళ్లనే సన్‌రైజర్స్ హైదరాబాద్ వదులుకున్నట్లు అర్థమవుతుంది. హెన్రిచ్ క్లాసెన్‌ను వదిలేస్తుందని ప్రచారం జరిగినా సన్‌రైజర్స్ హైదరాబాద్ మాత్రం అతన్ని అంటిపెట్టుకుంది. ఒక్క ప్లేయర్‌ను కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ ట్రేడ్ చేసుకోలేదు. వేలానికి ముందు అయినా ట్రేడ్‌కు ప్రయత్నిస్తుందో లేదో చూడాలి.

# 8 మంది ఆటగాళ్లను వేలంలోకి వదిలేసిన ఆర్‌సీబీ

ఐపీఎల్ 2026 సీజన్ మినీ వేలానికి ముందు డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) తమ రిటైన్, రిలీజ్ లిస్ట్‌ను ప్రకటించింది. కోర్ టీమ్‌ను కొనసాగించిన ఆర్‌సీబీ.. జట్టుకు భారంగా మారిన 8 మంది ఆటగాళ్లను వేలంలోకి వదిలేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. కోహ్లీ క్లోజ్ ఫ్రెండ్ అయిన స్వస్తిక్ చికరాపై వేటు పడింది. ఐపీఎల్ 2025 సీజన్ మొత్తం స్వస్తిక్ చికరా కోహ్లీ చుట్టూనే తిరుగుతూ కనిపించాడు. కోహ్లీని కాక పడుతున్నాడని అప్పట్లో స్వస్తిక్ చికరాపై సోషల్ మీడియా వేదికగా సెటైర్లు పేలాయి.అతనితో పాటు ఇంజ్యూరీ రిప్లేస్‌మెంట్‌గా జట్టులోకి వచ్చిన మయాంక్ అగర్వాల్‌ను కూడా ఆర్‌సీబీ వదిలేసింది. అందరూ ఊహించినట్లుగానే బ్యాకప్ వికెట్ కీపర్ టీమ్ సీఫెర్ట్, స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్‌లను కూడా ఆర్‌సీబీ వదిలేసింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన లివింగ్ స్టోన్ తీవ్రంగా నిరాశపర్చాడు.మనోజ్ భాండగే, లుంగి ఎంగిడి, బ్లెస్సింగ్ ముజర్బాని, మోహిత్ రతీలను కూడా ఆర్‌సీబీ వదిలేసింది. ఈ 8 మంది ఆటగాళ్లను వదిలేయడంతో ఆర్‌సీబీ రూ.16.4 కోట్ల పర్స్ మనీతో ఆర్‌సీబీ మినీ వేలంలోకి వెళ్తోంది. కోర్ టీమ్‌ను కొనసాగించిన ఆర్‌సీబీ వారికి అనుగుణంగా బలమైన బ్యాకప్ ప్లేయర్లను కొనుగోలు చేయనుంది. డిసెంబర్ 16న అబుదాబి వేదికగా మినీ వేలం జరగనుంది.

# అవతార్-3 వచ్చేస్తోంది..
## రికార్డు స్థాయిలో రన్ టైమ్!



హాలీవుడ్ సంచలన దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టిస్తున్న దృశ్య కావ్యం 'అవతార్' సిరీస్‌కు సంబంధించి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ఫ్రాంచైజీలో మూడో భాగంగా రానున్న 'అవతార్: ఫైర్ అండ్ ఆష్' సినిమా రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం ఏకంగా 3 గంటల 15 నిమిషాల (195 నిమిషాలు) నిడివితో రానుండటం విశేషం. దీంతో 'అవతార్' సిరీస్‌లోనే ఇది అత్యంత అధిక నిడివి గల చిత్రంగా రికార్డు సృష్టించనుంది.
గతంలో వచ్చిన 'అవతార్' (2009) మొదటి భాగం 2 గంటల 58 నిమిషాలు ఉండగా, రెండో భాగం 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' 3 గంటల 12 నిమిషాల నిడివితో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు మూడో భాగం అంతకుమించిన నిడివితో రాబోతోంది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2025 డిసెంబర్ 19న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పండోరా గ్రహం నేపథ్యంలో సాగే ఈ కథలో ఈసారి ఓ కొత్త విలన్‌ను పరిచయం చేయబోతున్నారు. 'వరాంగ్' అనే ఈ పాత్రలో నటి ఊనా చాప్లిన్ కనిపించనుంది. పండోరా జీవధార అయిన ఐవా ను వ్యతిరేకించే తొలి నావి పాత్ర ఇదే కావడం కథలో కీలక మలుపు కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు జేమ్స్ కామెరూన్ మాట్లాడుతూ.. "గత భాగాలతో పోలిస్తే ఇది మరింత ఉత్కంఠభరితంగా, భావోద్వేగభరితంగా, భారీ స్థాయిలో ఉంటుంది" అని తెలిపారు. సామ్ వర్తింగ్టన్, జోయ్ సల్డానా, సిగోర్నీ వీవర్, కేట్ విన్‌స్లెట్ వంటి పాత తారాగణంతో పాటు కొత్తగా ఊనా చాప్లిన్ కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు.

# మహేశ్ బాబు. 'వారణాసి'
## 2027 వేసవిలో రిలీజ్



సూపర్‌స్టార్ మహేశ్ బాబు, ప్రముఖ దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి సంబంధించిన మరొక అప్‌డేట్ వచ్చింది. ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రానికి 'వారణాసి' అనే పేరును ఖరారు చేశారు.
ఈ మేరకు, శనివారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన కార్యక్రమంలో ఈ టైటిల్‌ను పరిచయం చేశారు. ఈ చిత్రంలో మహేశ్ బాబు రుద్ర అనే పాత్రలో కనిపించనున్నారు.
ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి ప్రముఖ తారలు ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మహేశ్ బాబు ఫస్ట్ లుక్ విశేషంగా ఆకట్టుకుంది. నందిపై కూర్చుని, చేతిలో త్రిశూలంతో, మెడలో నంది లాకెట్ ధరించి ఆయన స్వారీ చేస్తున్నట్లుగా ఈ చిత్రం ఉంది.
యావత్ భారత సినీ ప్రపంచం అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లోని ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించిన అతిపెద్ద అప్‌డేట్ వచ్చేసింది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ఖరారు చేసింది. ఈ భారీ యాక్షన్ అడ్వెంచర్‌ను 2027 వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో శనివారం అట్టహాసంగా నిర్వహించిన 'గ్లోబ్‌ట్రాటర్' ఈవెంట్‌లో ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ, యువ నిర్మాత ఎస్.ఎస్. కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత కేఎల్ నారాయణ మాట్లాడుతూ 15 ఏళ్ల తన నిరీక్షణను పంచుకున్నారు. "పదిహేనేళ్ల క్రితం రాజమౌళిగారితో సినిమా చేద్దామని అడిగాను, ఆయన వెంటనే ఒప్పుకున్నారు. కానీ ఇంత సమయం పడుతుందని మేమిద్దరం ఊహించలేదు. ఈ మధ్యలో ఆయనకు 'ఈగ', 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి భారీ విజయాలు వచ్చాయి. దర్శకుడిగా ఎంతో ఎత్తుకు ఎదిగినా, అప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ఆయనకు ధన్యవాదాలు. సూపర్‌స్టార్ కృష్ణగారి లాగే మహేశ్ బాబు కూడా నిర్మాతల హీరో. ఇన్నేళ్లు ఓపికగా ఎదురుచూశారు. ఈ సినిమాలో భాగమైనందుకు ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, మహేశ్ బాబు గారికి కృతజ్ఞతలు" అని తెలిపారు. ఈ సినిమా సహ నిర్మాత, రాజమౌళి-రమా దంపతుల తనయుడు కార్తికేయ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "ఇంత పెద్ద ప్రాజెక్ట్ ఇంత త్వరగా వస్తుందని నేను ఊహించలేదు. ఇందులో పనిచేస్తున్న వారందరూ లెజెండ్స్. ఇది నాకు దక్కిన అదృష్టం. ఈ సినిమాతో భారతీయ సినిమాను ప్రపంచ స్థాయికి, ప్రపంచ ప్రేక్షకులను భారత సినిమా వైపు చూసేలా చేస్తున్నాం. ఈ ప్రాజెక్ట్ కోసం 15 ఏళ్లు వేచి చూసిన కేఎల్ నారాయణ గారికి నా ధన్యవాదాలు" అని కార్తికేయ అన్నారు.ం

# ఐబొమ్మ నిర్వాహకుడు అరెస్ట్..



టాలీవుడ్ నిర్మాతలకి కొన్నాళ్లుగా చుక్కలు చూపిస్తున్న వెబ్‌సైట్ ఐబొమ్మ. ముఖ్యంగా ఓటీటీ, పైరసీ కంటెంట్‌ని విచ్చలవిడిగా ఆన్‌లైన్‌లో తమ వెబ్‌సైట్‌లో పెట్టేస్తుంది ఐబొమ్మ. ఎన్నిసార్లు నిర్మాతలు దీనిపై ఫిర్యాదు చేసినా ఇప్పటివరకూ ఐబొమ్మ కీలక నిర్వాహకుల్ని మాత్రం పోలీసులు పట్టుకోలేకపోయారు. అయితే తాజాగా ఈ కేసులో బిగ్గెస్ట్ బ్రేక్ వచ్చింది. ఐబొమ్మ కీలక నిర్వాహకులు ఇమ్మడి రవిని తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. దమ్ముంటే పట్టుకోరా షెకావత్.. పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్".. అనే డైలాగ్ పుష్ప 2లో ఎంత ఫేమస్ అయిందో తెలిసిందే. అయితే ఇదే రేంజ్‌లో తెలంగాణ పోలీసులకి గతంలో ఐబొమ్మ వార్నింగ్ ఇచ్చింది. మమ్మల్ని పట్టుకోవాలని చూస్తే మా దగ్గరున్న ఎంతోమంది సమాచారాన్ని లీక్ చేస్తామంటూ పోలీసులకే ఓపెన్ వార్నింగ్ ఇచ్చారు ఐబొమ్మ నిర్వాహకులు. అయితే ఈ వార్నింగ్‌ని అంతే సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ పోలీసులు అప్పటి నుంచి ఐబొమ్మ నిర్వాహకుల్ని పట్టుకోవడానికి చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తానికి ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. కూకట్‌పల్లిలో అతడ్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కరేబియన్ దీవుల్లో ఉంటూ ఐబొమ్మ వెబ్‌సైట్‌ని నిర్వహిస్తున్న రవి.. నిన్న ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పక్కా స్కెచ్‌తో రవిని అరెస్ట్ చేశారు. ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా ఓటీటీ, పైరసీ కంటెంట్‌ని రవి ఆన్‌లైన్‌లో పెడుతున్నాడు. రవి తన భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నట్లు సమాచారం. ఇక రవి అకౌంట్‌లో ఉన్న రూ.3 కోట్లను పోలీసులు ఫ్రీజ్ చేశారట. తెలుగు సినీ నిర్మాతల ఫిర్యాదుతోనే ఈ అరెస్ట్ జరిగింది. దమ్ముంటే పట్టుకోవాలంటూ గతంలో పోలీసులకి కూడా రవి సవాల్ చేశాడు. ప్రస్తుతం సర్వర్లలో ఉన్న పైరసి కంటెంట్‌ని పోలీసులు చెక్ చేస్తున్నారు. గతంలో తమ వెబ్‌సైట్ ద్వారా పోలీసులకి ఐబొమ్మ నిర్వాహకులు వార్నింగ్ ఇచ్చారు. "సినీ ఇండస్ట్రీలో కొంతమంది మాపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ మేం ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజులు, సబ్‌స్క్రిప్షన్లు వసూలు చేయడం లేదు. మా సైట్లో అన్ని సినిమాలు ఉచితంగానే చూడొచ్చు. హీరోలకు వందల కోట్ల రూపాయలు రెమ్యునరేషన్లు ఇస్తున్నారు. విలాసవంతమైన ట్రిప్పులు నిర్వహించి వాటి భారాన్ని సామన్యులపై వేస్తారా. సినీ ఇండస్ట్రీ నష్టాలకు కారణం మేం కానే కాదు.. నిర్మాతలు, హీరోలే దీనికి కారణం. సినిమా బడ్జెట్లో ఎక్కువ శాతం హీరోల రెమ్యునరేషన్లకే వెళ్లిపోతుంది. విదేశాల్లో షూటింగుల పేరుతో బడ్జెట్‌ని విపరీతంగా పెంచేస్తున్నారు. అదే ఇండియాలో షూటింగ్ చేస్తే ఖర్చు తగ్గుతుంది. అనవసర ఖర్చు పెట్టేసి దాని రికవరీ కోసం ప్రేక్షకుల్ని ఇబ్బంది పెట్టడం ఎందుకు. చావుకి భయపడని వాడు దేనికీ భయపడడు. మేం ఎక్కడున్నా భారతీయుల కోసం మరీ ముఖ్యంగా తెలుగు వాళ్ల కోసం పనిచేస్తూనే ఉంటాం" అంటూ ఐబొమ్మ పోస్ట్ పెట్టింది.

## 'అఖండ 2'లో హిందూ సనాతన ధర్మం యొక్క శక్తి, పరాక్రమాన్ని చూస్తారు: బాలకృష్ణ




నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ సినిమాలో హిందూ సనాతన ధర్మం యొక్క శక్తి, పరాక్రమాన్ని చూస్తారని కథానాయకుడు బాలకృష్ణ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను వెంట తీసుకెళ్లి ఈ సినిమాను చూపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ముంబైలో చిత్ర బృందం ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా "రంగ రంగ శంభు లింగ ఈశ్వర" అంటూ సాగే భక్తి గీతాన్ని విడుదల చేశారు. ఎస్.ఎస్. తమన్ స్వరపరిచిన ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించగా, శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ అద్భుతంగా ఆలపించారు.
ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ.. "నాది, బోయపాటిది విజయవంతమైన కలయిక. మేమిద్దరం కలిసి చేసిన గత మూడు చిత్రాలు విజయవంతమయ్యాయి. ఇది మాకు నాలుగో సినిమా" అని ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. "ఇది కేవలం సినిమా కాదు, భారతదేశ ఆత్మ. మన ధర్మం. అత్యంత శీతల వాతావరణంలో మేమంతా స్వెటర్లు వేసుకుని చిత్రీకరణలో పాల్గొంటే, బాలకృష్ణ గారు మాత్రం ఒక మామూలు పంచె కట్టుతో నటించారు. అది నటన పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. శివయ్యే మా వెనకుండి ఈ సినిమాను పూర్తి చేయించాడు" అని వివరించారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్తా మేనన్ కథానాయికగా నటించగా, ఆది పినిశెట్టి, జగపతిబాబు కీలక పాత్రలు పోషించారు. ఈ కార్యక్రమంలో తమన్, ఆది పినిశెట్టి, కైలాశ్ ఖేర్, నిర్మాతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ్ రక్షిత్ దర్శకత్వంలో నటించనున్న ప్రభాస్



ప్యాన్ ఇండియా హీరోలు ఒక సమయంలో ఒక సినిమా చేయడానికే కిందా మీద పడుతూ రెండు మూడేళ్లు తీసుకుంటున్న ట్రెండ్ లో పానీపూరిలు తిన్నంత ఈజీగా ప్రభాస్ దర్శకులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అంతు చిక్కడం లేదు. తాజాగా డాన్స్ మాస్టర్ ప్రేమ్ రక్షిత్ కథకు ఇంప్రెస్ అయిన డార్లింగ్ ఓకే చెప్పేశాడట. ఆర్‌ఆర్‌ఆర్ నాటు నాటుకి కొరియోగ్రఫీ సమకూర్చడం ద్వారా ఆస్కార్ స్టేజి ఎక్కిన ఈ నృత్య దర్శకుడికి ఇది పెద్ద ప్రమోషన్. ఎందుకంటే టయర్ 2 హీరో దొరికితే అదే గొప్పనే పరిస్థితిలో ఏకంగా ప్రభాస్ తో మూవీ అంటే చేతిలో రెండు వేల కోట్ల ప్రాజెక్టు ఉన్నట్టే. ఇంతకన్నా ఏం కావాలి. దీని గురించిన అధికారిక ప్రకటన రాలేదు కానీ దాదాపు కన్ఫర్మ్ అన్నది విశ్వసనీయ వర్గాల సమాచారం. నిర్మాణ సంస్థ తదితర వివరాలు తెలియాల్సి ఉంది. ఇతర సోర్స్ నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఇదో యానిమేషన్ మూవీ అని, ప్రభాస్ లైవ్ గా నటించకపోవచ్చని, కేవలం తన పాత్రకు డబ్బింగ్ మాత్రమే చెబుతారని అంటున్నారు. ఇదింకా నిర్ధారణ కావాల్సి ఉంది. డాన్స్ మాస్టర్లు డైరెక్టర్లు కావడం కొత్త కాదు. లారెన్స్ రాఘవేంద్ర, ప్రభుదేవా బ్లాక్ బస్టర్లు సాధించారు. అమ్మ రాజశేఖర్ ఖాతాలోనూ సూపర్ హిట్ ఉంది.

## అన్నీ తెలుస నుకుంటే పప్పులో కాలేసినట్లే!

అన్నీ నాకే తెలుసు..నాకు తెలియంది ఏం లేదు. ప్రపంచమే నన్ను చూసి నేర్చుకుంటుందని కొందరు అతి నమ్మకాన్ని ప్రదర్శిస్తుంటారు. తెలిసింది గోరంత అయినా కొండత తెలిసినట్లు అతిగా మాట్లాడుతుంటారు. తాజాగా అలాంటి వారిని ఉద్దేశించి బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. అన్నీ తెలుసని అనుకున్న రోజే తమకు అదే చివరి రోజు అవుతుందని అభిప్రాయపడింది. 'కొందరు తమని తప్పు అంటే ఎంత మాత్రం ఒప్పుకోరు. తామే రైట్ అని బుకాయిస్తారు? చేసిన పని తప్పు అని ఒప్పుకోవడానికి వాళ్లకి ఎంత మాత్రం మనసు రాదు. జీవితంలో ప్రతీ దశకు వర్తింపు: తప్పును స్వీకరించడంలో తప్పుముంది? నేనెప్పుడు తప్పుడు, వైఫల్యాల గురించి భయపడను. తప్పులు చేయడం ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. చేసిన తప్పును మళ్లీ చేయకుండా జాగ్రత్త పడతాం. పిల్లలకు కూడా అంతే నడిచే వయసులో పిల్లలు చాలాసార్లు కింద పడతారు. అలా పడినప్పుడే మళ్లీ లేచి ఎంత బలంగా నడవగలం అన్నది వాళ్లకీ అర్థమవుతుంది. కింద పడ్డామని భయపడి పైకి లేవడం మానేయరుగా. ఆ క్షణానికి భయపడినా తగిలిన గాయం మానిన తర్వాత మళ్లీ లేచి నడక మొదలు పెడతారు. అందుకే జీవితంలో ప్రతీ దశకు, ప్రతీ వృత్తికి ఇది వర్తిస్తుందని నేను నమ్ముతాను. వారికెందుకో మనసు రాదు: కొన్నిసార్లు తప్పులు కూడా మంచి చేస్తాయన్నారు. 'ఈ విషయాన్ని అనుభవ పూర్వకంగానే తెలుసుకున్నాను. చాలా మంది ఫలానా పని చేసి తప్పు చేసామని ఆక్షణంలో బాధపడినా? తర్వాత అదే రైట్ అవుతుందన్నారు.

## ట్రెండింగ్ లో నెంబర్ వన్ గా రామ్ చరణ్ 'చికిరి' సాంగ్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమా నుంచి ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాట యూట్యూబ్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన రోజు నుంచే సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఈ పాట, తాజాగా 75 మిలియన్లకు పైగా వ్యూస్‌ను, 1.44 మిలియన్లకు పైగా లైక్స్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం యూట్యూబ్ మ్యూజిక్ ట్రెండింగ్‌లో ఈ పాట నంబర్ వన్ స్థానంలో కొనసాగుతుండటం విశేషం. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ మెలోడీకి ప్రముఖ గాయకుడు మోహిత్ చౌహాన్ తన గాత్రంతో ప్రాణం పోశారు. బాలాజీ అందించిన సాహిత్యం పాటకు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఈ పాట విజయం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

